ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

ఏప్రిల్ 2018

సంపుటి : 24 **279** సంచిక : 4

దేశమనియెడు దొడ్డ వృక్షము ప్రేమ యనెడి పూలెత్తవలెనోయ్!

-దేశమంటే మట్టికాదోయ్! దేశమంటే మనుషులోయ్-

ఎన్నేళ్ళ క్రిందట మహాకవి, ఎన్నేళ్ళ క్రితం పై కవిత చెప్పారు! భవిష్యత్తులో ఎంతకాలం ఈ మాటలు నిత్యసత్యాలనిపిస్తాయ్!

మహాకవిగా పేరొందిన ప్రజాకవి గురజాడ అప్పారావు మరెన్నాళ్ళకు జన్మిస్తారు? అలాటి మహా కవులకు పునర్జన్మ ఉంటుందా? ఉన్నా ముత్యాల వంటి అక్షరాలలో సరాలను ఎవరు కట్టగలరు? స్వరకల్పన నెవరు చేయగలరు? చేయలేరే! ఇది కేవలమూ చదువుకున్న విద్యకాదే? డిగ్రీల కోసం, బిరుదల కోసం వ్రాసిన కవిత కాదే!

అందుకే ఆయన్ను మహాకవి అన్నారు! ప్రజాకవి అన్నారు! ప్రజల కవి యన్నారు! అలాటి భావాలూ పూసగుచ్చిట్టుండే అక్షరమాల కూర్చడం సాధ్యమా? ఇలా ఎన్ని కవితలు! ఎన్నెన్ని మన్నికైన కవితలు! అనుకరించ సాధ్యమా? అలరింప సాధ్యమా? అక్షర అక్షరానికీ, పదానికీ పదానికీ ఎన్నెన్ని సొగసులున్నాయ్! ఎంతటి సౌగంధికా సుగంధమున్నదీ? ఒక కవితను మరొక కవితతో పోల్చినపుడు - ఇవ్వొక కవికి సాధ్యమా? అని ప్రశ్నించుకుంటే ఉండదనే చెప్పాలి.

మహా సముద్రం కెరటాల హోరూ, జోరూ, సొరూ తీరాలలోనే! లోనికి వెడుతున్న కొద్దీ ప్రశాంతత ఉంటుంది? మహా కవులూ + ప్రజా కవుల కవితలు అలాంటివే!

దేవుడెకడో కొండ కోనల
దాగెనంటూ చూస్తావేలా?
కన్ను విప్పిన కానపడడో
కలిగి యాడో ముక్తినతడు

-ఎంతటి ప్రశ్నాయుతమైన చమత్కారము? ఎవరికైనా అలవడిందా? ఎవరైనా అనుసరించగలిగారా? కవితలోని శిల్పమూ, భావమూ, చమత్కృతీ ఛలోక్తీ- ఆయనకే సాధ్యమైంది! కవితలో కథను చెప్పిన చమక్ చమకృతీ ఆయనిదే!

కొండల నడుమను
కోనొకటున్నది-
కోనకు నడుమా
కొల నొకటున్నది
కొలను గట్టునా కోవెలొకటున్నది!
కొలను గట్టునా
కోవలె లోపల
వెలసెను బంగరు దుర్గమ్మా
ఏయే మాసమునందున
పూసే ఆయా పూలను పూజించీ
బంగరు దుర్గను భక్తితో కొలిచెను
పుత్తడి బొమ్మా పూర్ణమ్మా!

- అంటారు

(అరవై ఏండ్ల క్రితం నా నాలుకపై నడయాడిన పదాలను వ్రాసాను. తప్పులుంటే క్షమించండి)

- ఒక్కొక్క పంక్తిలో ఒక్కొక్క భావాన్ని, కనులకు సైతమూ దృశ్యమవు తున్నట్టుగా, వినాలని చెవులూరిస్తున్నట్టుగా, ప్రజల భాషలో, ఆ బాల గోపాలమునకూ అర్థమయ్యేటట్లు వ్రాసిన మహాకవి గురజాడ అప్పారావు మనసులో మెదలుతున్నారు, కళ్లముందు కనపడుతున్నారు.

గడచిన తరం వారినీ, ప్రస్తుత తరం వారినీ ముందు తరాలవారినీ మెప్పింపగలిగిన మహాకవి గురజాడ అప్పారావు ప్రాతఃస్మరణీయుడు! ప్రభాతమున లేచిన వెంటనే ఆయనకు తొలి నమస్కారం చేయాలి. ఇలాటి మహాకవులు మరల జన్మిస్తారా - అన్నది ప్రశ్నార్థకమే!

మన తెలుగులో ఏ తేజస్సున్నదీ అని ప్రశ్నించు కుని, వారికిదో తేజస్సమాధానపడే సమాధానం! ఇలా మహాకవులను పదేపదే స్మరించుకుంటూ తెలుగు తల్లీ! నీ వెంతటి వాఙ్మయ రాశివే తల్లీ! - అంటూ భూత, వర్తమాన, భవిష్యద్భాషా విభూషినికి నమస్కరిస్తున్నాను.



బుధజన విధేయుడు

- గోటేటి శ్రీరామారావు

Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com
YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-

ఆలయంలో మూలవిరాట్ లింగం

సువర్ణముఖి తీరంలో అత్యంత పురాతన ఆలయంగా ప్రసిద్ధి పొందిన చాతుర్లింగేశ్వర దేవాలయం

విజయనగరం జిల్లా బలిజపేట మండలం సువర్ణముఖి నదీ పరీవాహక ప్రాంతమైన నారాయణపురం గ్రామంలో నిర్మితమైన చాతుర్లింగేశ్వర దేవాలయం ఎంతో చారిత్రక ప్రసిద్ధి గాంచిన సుప్రసిద్ధ దేవాలయం. 11వ శతాబ్దం నాటి అపురూప శిల్పకళా నైపుణ్యం విలసిల్లే అందమైన రాతి కట్టడాలతో నిర్మించారు. శ్రీనీలకంఠేశ్వర, సంగమేశ్వర, మల్లికార్జున, శ్రీనీలేశ్వర ఆలయాలు ఒకే చోట కొలువై ఉండటం ఇక్కడికి ప్రత్యేకతలు. ఆలయ రాతి స్తంభాలపై ఉండే శాసనాలు ఆలయాలపై ఉండే శిల్పాలు అలనాటి చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచాయి.

తూర్పుగాంగులలో ముఖ్యుడు అనంతవర్మ చోడగంగదేవుడు. ఈయన క్రీ.శ. 1077వ సంవత్సరం నుండి 1147 వరకు పరిపాలించాడు. ఆయన కాలంలోనే ఈ చాతుర్లింగ ఆలయాల నిర్మాణం జరిగినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది.

శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయం

చాతుర్లింగ శివాలయాలలో అత్యంత ప్రధానమైనది శ్రీ నీలకంఠేశ్వరస్వామి ఆలయం. దీని ఎత్తు 31 అడుగులు. ఒరిస్సాలో పరశురామేశ్వర ఆలయ శిఖరాన్ని పోలి ఈ ఆలయ విశేషం. గర్భగుడి ద్వారంపైన నవగ్రహాలు, పైభాగాన గజలక్ష్మి విగ్రహం కనువిందును కూరుస్తాయి. గర్భగుడికి ముందు దీర్ఘ చతురస్రాకారంలో ఉన్న మండపం లోపల ఒక్కొక్క వరుసలో నాలుగు స్తంభాల వంతున రెండు వరుసలుగా ఉంటాయి. ఈ స్తంభాలపై చారిత్రక, పురాణ ఘట్టాల శిల్ప, చిత్రాలతో మండపం అద్భుతమనిపిస్తుంది. స్తంభాలపై సుమారు 40 శాసనాలు ఉన్నాయి. మండపం పైకప్పు అనేక రాతి పలకలతో అమర్చబడి ఉంది. గర్భగుడిలో నునుపుతేలిన శివలింగం. పానవట్టం పరమ పవిత్రంగా దర్శనమిస్తాయి.



ఆలయం గోడలపై చెక్కిన వినాయకుడి విగ్రహం

ఆలయం గోడలపై చెక్కిన దేవీ విగ్రహం

సంగమేశ్వర ఆలయం

ఇది నీలకంఠేశ్వర ఆలయానికి ఉత్తర భాగాన దీర్ఘచతురస్రాకారంలో ఉంది. దీని నిర్మాణం కళింగ దేవాలయాల పద్ధతిలో ఒకటైనా ఖాఖారా ఆలయ నిర్మాణశైలికి చెందినది.

మల్లికార్జునాలయం

నీలకంఠేశ్వరాలయానికి ఉత్తర భాగంలో ఈ ఆలయం ఉంది. గర్భ గృహద్వారం చిత్రలేఖనాలతో అలంకరించిన నవగ్రహాలున్నాయి. ద్వారానికి ఇరువైపులా గంగ, యమున విగ్రహాలున్నాయి. గోడ పైభాగాన గల అరలలో మహిషాసుర మర్ధిని, ఏకపాదమూర్తి, కార్తికేయ, అర్ధనారీశ్వరుడు, గణేశ, గంగాధరమూర్తి విగ్రహాలు ఉన్నాయి.

నాలేశ్వరాలయం

ఇది నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి దక్షిణ భాగంలో ఉన్న చతురస్రాకార గర్భాలయం. పదహారున్నర అడుగుల ఎత్తు కలిగిన ఆలయం. ఆలయ శిఖరం ఉత్కల్ (ఒరిస్సా) శిల్ప సాంప్రదాయంతో అర్ధచంద్రాకారరేఖలు కలిసినట్లు ఉంటుంది. ఈ ఆలయం మిగిలిన మూడు ఆలయాలను పోలి ఉండటం విశేషం.

శాసనాలు

నీలకంఠేశ్వరస్వామి ఆలయం ముఖ మండపం లోని రాతిస్తంభాలపై క్రీ.శ. 1102 –1251ల మధ్యకాలం నాటి 53 శిలా శాసనాలు దేవనాగరి లిపిలో ఉన్నాయి.

కార్తీక మాసంలో పూజలు

నిత్యధూప దీప నైవేద్యాలతో విరాజిల్లుతున్న ఈ చాతుర్లింగేశ్వర ఆలయంలో కార్తీక మాసం నెల రోజులూ ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఇక్కడికి సుమారు 23 కిలోమీటర్ల దూరంలో గళావెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయం ఉంది. ఇది కూడా 11వ శతాబ్దానికి చెందిన ఆలయం. భక్తులు ఈ ఆలయాన్నీ సందర్శిస్తుంటారు.

ఎలా వెళ్ళాలంటే... విశాఖ, విజయనగరం, పార్వతీపురం నుండి వచ్చేవారు బొబ్బిలి చేరుకుని అక్కడి నుండి నేరుగా నారాయణపురం బస్సులో చేరుకోవచ్చు. బలిజపేట బస్సు ఎక్కితే బలిజపేటలో దిగి అక్కడి నుండి ఆటో ద్వారా 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న నారాయణపురం చేరుకోవచ్చు. శ్రీకాకుళం వైపు నుండి వచ్చేవారు రాజాం మీదుగా పణుకువలస జంక్షన్ నుండి తిరిగి వంతరాం, బలిజిపేట మీదుగా నారాయణపురం చేరుకోవచ్చు. రాజాం నుండి బస్సులో వచ్చేవారు బలిజిపేటలో దిగిన నారాయణపురం చేరుకోవచ్చు.

(బోణం గణేష్‌కు కృతజ్ఞతలతో)

చిన్నబోతున్న వృద్ధాప్యం

తల్లి గర్భం నుంచి ప్రపంచంలోకి వచ్చినప్పటి నుంచి మనం కొన్ని దశలను చేరుకోవాల్సి ఉంటుంది. బాల్యదశ, యవ్వన, గృహస్థ దశలను ఒక్కొక్కటి దాటి చివరకు చేరుకునే దశ వృద్ధాప్యం!

వృద్ధాప్యం ప్రతి మనిషి తన జీవిత ప్రయాణంలో ఒకానొక సమయంలో తప్పనిసరిగా చేరుకునే దశ. వృద్ధాప్యంలో వచ్చే శారీరక మార్పుల వల్ల వారిలో అప్పటి వరకు ఉన్న చురుకుదనం, మానసిక ధైర్యం నెమ్మదిగా తగ్గుముఖం పట్టడం చాలా సహజం, ఈ దశలో వారికి కుటుంబపరంగా, సమాజపరంగా చేయూత ఎంతో అవసరం.

ఒక తల్లి తాను ప్రసవ సమయంలో ఒక యుద్ధం చేస్తుంది. గెలుపు – ఓటమిల మధ్య పోరాడి ఒక ప్రాణికి జీవం పోస్తుంది తల్లి. తన సంతానం పుట్టింది మొదలు పెరిగి పెద్దయి ఒక గొప్ప స్థానంలో ఉండాలని ఆకాంక్షిస్తాడు తండ్రి. తల్లిదండ్రులు ఇరువురూ కూడా తమ సంతానంతో ఒక మధురమైన ఆత్మీయ పేగుబంధాన్ని పెనవేసుకుంటారు.

కానీ ఆ పిల్లలు పెరిగి పెద్దయిన తర్వాత అంత గొప్ప పేగు బంధాన్ని తెగతెంపులు చేసుకొని చివరకు ఆ తల్లిదండ్రులను నడిరోడ్డుపై నిరాశ్రయులుగా నిలబెడుతున్నారు. మరికొంత మందైతే ఆ పేగుబంధాన్ని డబ్బులిచ్చి మరి వృద్ధాశ్రమంలో వదలి వెళుతున్నారు.

పసిబిడ్డలాగా ఎంతో జాగ్రత్తగా చూసుకోవాల్సిన తల్లిదండ్రులను ఈ విధంగా నడిరోడ్డుమీద నిర్దయగా వదలి వెళ్ళడం తప్పు అనే భావన ఈనాటి తరం వాళ్ళకు కలుగడం లేదు. అదే మనం చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు మనకేమైనా చిన్న అనారోగ్య సమస్య కలిగినా లేదా చిన్న బాధకు మనం లోనైనప్పుడు తల్లిదండ్రులు ఎంత కంగారుపడతారో ఒక్కసారి మన బాల్య దశకు వెళ్ళి చూస్తే స్పష్టమవుతుంది. ఆ విషయాలన్నింటిని మనం విస్మరించి వారిని నిర్లక్ష్యంగా వదలి వెళుతున్నాము. ఆశ్రమాలలో వదలివెళ్ళినప్పటి నుంచి ఆ తల్లిదండ్రులు నా కొడుకు, కూతురు, మనవళ్ళు, మనవరాండ్లు ఎలా ఉన్నారో అంటూ అహర్నిశలు తలచుకుంటూ కృషించి క్రుంగిపోతున్నారు. చివరకు అక్కడే తుది శ్వాస విడుస్తున్నారు. ఆ వార్తను ఆశ్రమ నిర్వాహకులు వారి సంతానానికి తెలియజేసిన కూడా వారు చివరి చూపు చూడడానికి రాకపోవడం చాలా బాధాకరం.

కుటుంబం అనే పదంలో కేవలం నా భార్య, నా పిల్లలు అనే భావనలతో మాత్రమే భర్తీచేస్తున్నాము. నా తల్లిదండ్రులు అనే పదాన్ని ఎందుకు తీసివేస్తున్నాము. 'నా' అనే అక్షరంలో భార్య, పిల్లలతో పాటు నా తల్లిదండ్రులు అనే పదాన్ని కూడా చేర్చితేనే అది నిజమైన కుటుంబ వ్యవస్థ అవుతుంది. ఈ కుటుంబ వ్యవస్థ మన భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుంది.

ఎంతో గొప్ప చరిత్ర – సంస్కృతి గల దేశం మనది. మన దేశచరిత్ర దేశదేశాల యందు గొప్పగా చెప్పుకోబడుతుంది. కానీ మనం విదేశాల సంస్కృతిని అరువుగా తెచ్చుకుంటున్నాము. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థతో ఎంతో గొప్పగా ఉన్న మన సంస్కృతి ఇప్పుడు అధఃపాతాళంలోకి కూరుకుపోతోంది.

మనం ఎన్నో ఉన్నత విద్యలు అభ్యసిస్తున్నాము. అనేక నైతిక విలువలు తెలుసుకుంటున్నాము కానీ తల్లిదండ్రులను బాగా చూసుకోవాలి అనే ఆలోచనకు దూరమవుతున్నాము. పెద్దలను నిర్లక్ష్యం చేస్తున్నాము. వారికి ఆశ్రమాలే తుది మజిలీలుగా చేస్తున్నాము.

చివరి దశలో ఉన్న తల్లిదండ్రులను కాస్త ప్రేమగా పలకరించి వారితో కొంత సమయం గడిపితే ఆ ముసలి హృదయాలు చాలా సంతోషిస్తాయి. వారిని కాస్త ప్రేమగా దగ్గరకు తీసుకోవాలి కానీ అది మరచిపోయి వారిని విచక్షణ కోల్పోయి తిట్టడం, ఇంకా వారికి ఆశ్రమాలలో వదలివెళుతున్నాము.

మనిషి యొక్క ఆలోచనలో మార్పు రావాలి. నా తల్లిదండ్రులు నన్ను చిన్నప్పటి నుండి కంటికి రెప్పలా కాపాడారు. నా తల్లి నన్ను నవమాసాలు మోసి ఎన్నో బాధలకు ఓర్చి ఈ భూమి మీదకు తీసుకువచ్చింది. వారిని తుదిశ్వాస విడిచే వరకు నేను జాగ్రత్తగా చూసుకుంటాను. అనే భావన ప్రతి మనిషిలో కలగాలి.

మాతృదేవోభవ! పితృదేవోభవ! అనే గొప్ప మాటలను ప్రస్తుతకాలంలో మాటలు గానే మిగిలిపోతున్నాయి. తల్లిదండ్రులను భగవంతుడితో సమానం చూసుకోవడం మానేసి కనీసం వారిని మనుష్యులుగానైనా దగ్గరికి తీసుకోవటం లేదు.

మనం మన తల్లిదండ్రులను ఈవిధంగా నిర్లక్ష్యంచేస్తే భవిష్యత్తులో మన పిల్లలు మనలిని అనుసరించి వారు కూడా మనల్ని నిర్లక్ష్యం చేసి ఆశ్రమాలలో వదలివెళతారు అనే భావన మనలో కలిగి, మనం మన ప్రవర్తనలో ఆలోచనలో మార్పు తెచ్చుకొని, భవిష్యత్ తరాలకి ఆదర్శంగా నిలవాలి.

– పి.మమత, ప్రసారిక

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

"అజంతా"

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

044 25204046, 26171341

నటుడిగా బాపు ఓ చిత్రంలో కనబడతాడు!

ప్రచారానికి ఎప్పుడూ ఆమడ దూరంలో ఉండే కొందరు సినిమా దర్శకుల్లో ప్రసిద్ధ హాలీవుడ్ సస్పెన్స్ చిత్రాల దర్శకుడు ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ ఒకరు. అయితే ఆయనకు ఓ చిత్రమైన సరదా ఉండేది. తన చిత్రాల్లో ఎక్కడో ఓ చిన్న సన్నివేశంలో అలా ఓ మెరుపు మెరిసినట్లుగా కనబడి ప్రేక్షకులను ఆశ్చర్యపరచడం ఆయన అలవాటు. ఆయన సినిమాలో ఎక్కడ కనబడతాడోనని ప్రేక్షకాభిమానులు కూడ కుతూహలంగా చూసేవారు. ఉదాహరణకు ఓ ముఖ్య పాత్రధారి రెస్టారెంట్‌కు వెళ్లిన సీన్ ఉంటే, అక్కడ ఏదో ఒక మూల కాఫీ తాగుతున్నట్లుగా కనిపించేవారు. అలా ఎక్కడా కనిపించడానికి అవకాశం లేకపోతే, చిత్రంలో ఓ పాత్రధారి ఏదైనా న్యూస్ పేపర్ చదువుతున్న దృశ్యం ఉంటే, ఆ పేపర్లో ఓ మూల ఆయన ఫోటో కనబడేది. ప్రేక్షకులు అది కనిపెట్టి థ్రిల్ ఫీల్ అయ్యేవారు. మన ప్రసిద్ధ దర్శకుడు బాపుగారు కూడా పబ్లిసిటీకి చాలా దూరంగా ఉండేవారు. సినిమా మీడియా గురించి చెప్పమంటే 'నా గురించి నా సినిమాలే చెబుతాయి. అంతకుమించి నేనేం చెప్పగలను? సినిమా మీడియం గురించి చెప్పగల తాహతు నాకు లేదు' అని తప్పించుకునేవారు బాపు. అయితే విశేషం ఏమిటంటే ఆయన ఒకే చిత్రంలో చిన్న వేషం వేశారు. అది తెలుగు చిత్రం కాదు. 'ఓ సాత్ దిన్' అనే హిందీ చిత్రాన్ని ఆయన డైరెక్ట్ చేశారు. ఎలా సరదా కలిగిందో కానీ అందులో ఆయన ఓ మార్వాడీ వేషంలో తళుక్కున మెరుస్తారు.

పట్టుదలతో పాట నెగ్గుబాటు!

కళారంగంలో కొన్ని విభాగాల్లో ఎప్పుడో ఒకప్పుడు ఓ పరీక్ష సమయంవంటిది ఎదురవుతుంది. అలాంటి సందర్భాలలో ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా, ఆ క్లిష్ట మైన ఘట్టాన్ని ఎదుర్కొని, తమ ప్రతిభను నిరూపించుకుంటారు ప్రజ్ఞావంతులైన కళాకారులు. ప్రసిద్ధ గాయని పి (పులపాక) సుశీల చలనచిత్ర జీవితంలో అలాంటి క్లిష్టమైన ఘట్టాలు రెండున్నాయి. మొదటిది 'శ్రీకృష్ణ తులాభారం' (1966) చిత్రంలో ఆమె పాడిన పాట 'మీర జారగలడా?' స్థానం నరసింహారావు గారు రాసిన ఈ పాపులర్ గీతం పెండ్యాలగారి సంగీత దర్శకత్వంలో రూపొం దింది. ఈ పాటలో 'పర్ఫెక్షన్' కోసం పెండ్యాలగారు ఎంత తపించారో, ఆయన అనుకున్న మేరకు పాట అద్భుతంగా రూపొందడానికి సుశీలగారు ఎంత కృషి చేశారో, ఎన్ని 'టేక్స్' తీసుకోవలసివచ్చిందో, ఐనా, ఇద్దరూ అనుకున్న ఫలితాన్ని ఎలా సాధించారో ఇప్పుడు తలచుకున్నా ఆమె ఉలికిపడుతుంటారు.

అటువంటి పరిస్థితి ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎస్. విశ్వనాథన్ ('మరోచరిత్ర' ఫేమ్)తో ఎదురైంది. అది 'కావ్యతలైవి' (కావ్యనాయిక' అని

అర్థం) అనే తమిళ చిత్రంలోని 'ఒరునాళ్ ఇరవిల్' 'ఒకరోజు రాత్రిపూట) అనే ఓ మధురగీతం కోసం ఆ చిత్రాన్ని ప్రముఖనటి షావుకారు జానకి– కె. బాలచందర్ దర్శకత్వంలో నిర్మించారు. సుచిత్రాసేన్ నటించిన 'మమత' దీనికి ఆధారం. ఆ పాటకు అద్భుతంగా ట్యూన్ సమకూర్చిన విశ్వనాథన్‌గారు అది ఎలా పాడాలో ఎక్కడెక్కడ చమక్కులు ప్రదర్శించాలో విడమర్చి చెప్పారు. అయితే రిహార్సల్స్ చేస్తున్నప్పుడు విశ్వనాథన్ చెప్పినంత గొప్పగా తన పాడలేనేమో అన్న అనుమానం సుశీలగారిలో తలెత్తింది. దాంతో ఆమె రికార్డింగ్ స్టూడియో నుంచి బయటకు వచ్చి, దగ్గర్లోనే వున్న టెలిఫోన్ బూత్ లోకి వెళ్లారు. అక్కడ ఆమె కళ్ళ నీళ్లు తుడుచుకోవడాన్ని రికార్డింగ్ ఇంజనీర్ రంగస్వామి గమనించారు. బహుశా సంగీత దర్శకుడు ఏమన్నా అన్నారేమోనని ఆయనకు అనుమానం వచ్చి, విశ్వనాథన్‌ను అడిగారు. ఆయన ఆ విషయం విని దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈలోగా సుశీలగారు కారులో ఇంటికి వెళ్ళిపోయారు ఎవరితో ఏమీ చెప్పకుండా! విశ్వనాథన్ ఆమెకు ఫోన్ చేసి విషయమేమిటో చెప్పమని అడిగారు. 'ఆ పాట మీరు అనుకున్నంతగా బాగా పాడగలనని అని పించడం లేదు. ఇంకెవరిచేతనైనా పాడించుకోండి' అన్నారు సుశీల. విశ్వనాథన్‌గారు చిన్నగా నవ్వి, 'లేదమ్మా ఆ పాట నువ్వే పాడాలి. ఇంకెవ్వరు పాడరు' అన్నారు దృఢంగా. తన పాట మీద ఆయనకు ఇంత నమ్మకం వుండటంతో, ఆమెలోను ఆత్మవిశ్వాసం ఏర్పడింది. వెంటనే రికార్డింగ్‌కు హాజరై ఆయన చెప్పినట్లుగానే ఆ పాటను గొప్పగా పాడి, ఎంతో పేరు తెచ్చుకున్నారు. మనం తరచి తరచి అడిగి తెలుసుకుంటే, ప్రతి ప్రజ్ఞాశాలి జీవితంలోనూ ఇలాంటి క్లిష్టమైన ఘట్టాలు వుంటాయి మరి! ●

Compliments from

Sri Krishna Bhat

When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala

WOOD SIDE ANNEXE
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

WOODSIDE
HOTEL WOODSIDE
E.Car Street, Tirupathi. Ph : 2284464

ఎంత జీవం ఎంత వైవిధ్యం

జీవ వైవిధ్యం మొక్కల్లోనూ ఉన్నది! మొక్కవోని మధురమది. సామర్థ్యం ఆయన స్వంతం. ఆయన ఒక వైవిధ్యమైన వృక్షవనాన్నే పెంచుతున్నారు! ఆయనే మంథా రామమూర్తి. ఆయన తన అధ్యాపక తెలివితేటలను జీవన వైవిధ్యంగల మొక్కల పెరుగుదలకు ధారవోస్తున్నారు.

జీవన వైవిధ్యం గల ఎన్నో రకాల మొక్కలు ఆయన పెంపకంతో పెరుగుతున్నాయ్! ఇందు మాంసాహార మొక్కలు కూడా కనువిందు చేస్తున్నాయ్.

కృషి ఉంటే రైతులు ఋషులవుతాడనడానికి ఆయన, ఆయన పెంచిన వనమే మనకు సాక్ష్యం.

విశాఖలో సందర్శకులను కట్టిపడేసే ఓ పార్కు! నీతిబోధక పాఠాలు చెప్పే అధ్యాపకుడు ఆ వన పచ్చదనానికి అధ్యాపకుడు!

ఎన్ని మొక్కలో ఎడారి జాతులూ, మంసాహార రకాలూ, శాకాహార రకాలూ, ఎండ తగలకపోతే బెంగుపెట్టుకున్నట్టు వాడిపోయే సుకుమార వృక్షరాజాలూ... వాటి మధ్య శ్రావణ మాసపు పేరంటాల్లా అటూయిటూ తిరుగుతూ సందడి చేసే సీతాకోక చిలుకలూ.. హఠాత్తుగా ఏ కాచిగూడా స్టేషన్ నుంచో ఆటోలో వచ్చే అతిథుల్లాంటి పక్షులూ.. కన్నుల పండువగా ఉంటుంది బయోడైవర్సిటీ పార్కు... వందలాది వృక్షజాతులకు నిలయమైన ఈ జీవవైవిధ్య ఉద్యానవనం విశాఖలోని పెదవాల్తేరు దగ్గరున్న రాణీచంద్రమదేవి ఆసుపత్రి ఆవరణలో ఉంది. ఈ పార్కు వెనుక పర్యావరణ ప్రేమికుడైన మంథా రామమూర్తి దంపతుల కృషి అపారం. జీవ వైవిధ్యాన్ని కాపాడాలన్న లక్ష్యంతో ఆ ఆలూమగలు... పార్కు ఏర్పాటుకు నడుముకట్టారు.

సొంత ఖర్చుతోనే...

మంథా రామమూర్తి జూవాలజీ ఉపాన్యాసకుడిగా పనిచేశారు. సముద్ర జీవుల మీద పీహెచ్‌డీ చేశారు. అలా అని ఆయన పాఠాలకే పరిమితం కాలేదు. చెట్ల విలువ తెలిసినవాడు. ప్రాణికోటి వైవిధ్యం అర్థమైనవాడు. కాబట్టి జీవ వైవిధ్య పార్కు ఏర్పాటు చేయాలన్న ఆలోచన కలిగింది. ఒక మొక్కని పెంచి పోషించడమే గగనమవుతున్న పరిస్థితుల్లో ఏకంగా ఉద్యానవనమునే పెంచారంటే మాటలు కాదు. అయినా సరే, ఆయన వెనక్కి తగ్గలేదు. 2001లో 'డాల్ఫిన్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ' పేరుతో ఓ సంస్థను స్థాపించారు. చాలామందిలో పర్యావరణ స్పృహ కల్పించారు. ఎంతోమంది పర్యావరణ ప్రేమికులు ముందు కొచ్చారు. సభ్యులుగా చేరారు. వారంతా జీవవైవిధ్య పార్కును నిర్మించాలని నిర్ణయించారు. ఆ ఉద్యమానికి అన్ని వైపులా నుంచీ మద్దతు లభించింది. ఆసు పత్రి ప్రాంగణంలో ఖాళీగా ఉన్న మూడెకరాల స్థలాన్ని కేటాయించారు. పార్కు నిర్మాణ పనులు మొదలయ్యాయి. ముందుగా ఓ జాబితా తయారు చేసుకున్నారు. స్థాని కంగా దొరికేవటితో ఇబ్బంది లేకపోయింది. ఫలానా రాష్ట్రంలో ఫలానా వెరైటీ దొరుకుతోందట.. అంటూ జనం నుంచి సమాచారం రావడమే ఆలస్యం వెంటనే వాటిని సేకరించే ప్రయత్నం మొదలయ్యేది. బంధువులూ, మిత్రులూ, ఉద్యానవన ప్రేమికులూ... ఉత్సాహంగా ముందుకొచ్చారు. విదేశాల నుంచి తెప్పించిన మొక్కలూ ఉన్నాయి. ప్రజల విరాళాలతోనో, ప్రభుత్వ నిధులతోనో ఇదంతా జరుగలేదు. ప్రతి పైసా, రామమూర్తి దంపతుల స్వార్జితమే, అప్పట్లోనే పార్కు నిర్వహణకు నెలకు పదివేల దాకా ఖర్చయ్యేది. అలా మొత్తం ఇరవై లక్షల దాకా వ్యయం చేశారు. అతి తక్కువ కాలంలోనే జీవ వైవిధ్య పార్కుకు మంచి గుర్తింపు వచ్చింది. ఇప్పుడిది ఉద్యానవనమే కాదు పరిశోధనా కేంద్రం. ఇక్కడి అరుదైన మొక్కలను చూసేందుకు పర్యాటకులు రావడం మొదలుపెట్టారు. పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా మొదలైన ఈ పార్కు ప్రాధాన్యాన్ని ప్రభుత్వమూ గుర్తించింది. 2013లో విశాఖ నగరాభివృద్ధి సంస్థ (వుడా) పార్కు నిర్వహణ బాధ్యతను స్వీకరించింది. రోజువారీ పనుల్ని చూసు కోవడానికి ఇద్దరు తోటమాలీల్ని నియమించింది. చుట్టూ కంచె నిర్మించింది. భద్రతా సిబ్బందిని కూడా ఏర్పాటుచేసింది.



పచ్చని నేస్తాలు..

ప్రస్తుతం ఈ జీవవైవిధ్య పార్కులో 2500 రకాల మొక్కలు ఉన్నాయి. వాటిచుట్టూ కనీసం 125 రకాల సీతాకోక చిలుకలు రంగురంగుల కోకలు కట్టుకున్నట్టు... తిరుగుతుంటాయి. దాదాపు డెబ్బై రకాల పక్షులు అతిథులుగా వచ్చిపోతుంటాయి. ఆ దృశ్యాలు నయనమనోహరంగా ఉంటాయి. పూల మొక్కలైతే మనసుల్ని కట్టిపడేస్తాయి. ఔషధ మొక్కల కోసం ప్రత్యేకమైన విభాగం ఉంది. ఆ గాలి పీల్చినా అనేక రుగ్మతలు దరిదాపుల్లోకి రావాని ఓ నమ్మకం. ఎడారి మొక్కల విభాగం ఎడారి మొక్కలకు ఉంది. పుష్పించే మొక్కలకు, పుష్పించని మొక్కలకు వేరువేరు విభాగాలున్నాయి. నీటి మొక్కల కోసం చిన్న కొలను తవ్వించారు. అందులో కలువలు కనువిందు చేస్తాయి. మన అడవుల్లో పెరిగే మొక్కల్ని కూడా ఇక్కడ పెంచుతున్నారు. అక్వేరియంలో వేసే మొక్క జాతులనూ వదల్లేదు. కృష్ణాస్ బట్టర్‌కప్. మిక్కీ మౌస్, లాఫింగ్ బుద్ధ, గుడ్‌లక్ బేంబూ, ఆఫ్‌సైడ్ డౌన్‌ట్రీ, హోలీక్రాస్ వంటి అరుదైన మొక్కలు కూడా సురక్షిత వాతావరణంలో పెరిగి పెద్దదవుతున్నాయి. రాఖీ పుష్పాలను చూసేందుకైతే జనం బారులు తీరుతున్నాఉ.

సజీవ శిలాజ మొక్కలు...

డైనోసార్ల కాలం నాటి మొక్కలు కొన్ని... కాలంతోపాటు ఎలాంటి మార్పులకూ లోనుకాకుండా అలానే ఉన్నాయి. వృక్షశాస్త్రంలో వాటిని సజీవ శిలాజ మొక్కలని అంటారు. అలాంటి మొక్కలిక్కడ 35 రకాల దాకా ఉన్నాయి. వాటిలో 'లివింగ్ పెబెల్స్' అనే మొక్క విచిత్రంగా గులకరాళ్ళ మధ్య పెరుగుతుంది. ఆకుల మధ్యలోంచి పుష్పాలు వికసిస్తాయి. వీటితోపాటూ జంగో బైలోబా, సైకాస్, జామియా, క్రిస్మస్ ట్రీ, డయూన్, పోడో కార్పన్ వంటి అరుదైన జాతులు ఉన్నాయిక్కడ. ఎడారి మొక్కలను కూడా పార్కులో భారీగా పెంచుతున్నారు. ఒక్క నాగజెముడులోనే 300 రకాల వరకూ చూడవచ్చు. అలాగే... ఓల్డ్‌మేన్స్ కాక్టర్స్ గోల్డెన్ బ్యారెల్, ఫింగర్ మేగ్నట్ వంటి అరుదైన ఎడారి జాతి మొక్కలు ఉన్నాయి. కొన్నింటిని చైనా, జపాన్ దేశాల నుంచి తెప్పించారు. వస, సరస్వతి ఆకు, జల బ్రహ్మ, కరక్కాయ, ఉసిరి. తమలపాకు, పిప్పళ్ళు, సర్పగంధి వంటి సంప్రదాయ ఔషధ మొక్కలకైతే కొదవే లేదు. కర్పూరం, సర్పగంధి, తులసి, గుగ్గిలం, కస్తూరి వగైరా వగైరా సుగంధ ద్రవ్యాల మొక్కల్నీ ఇక్కడ చూడవచ్చు. 'ప్రభుత్వ సహకారం తోడైతే దీన్ని జాతీయ స్థాయి ఉత్తమ జీవ వైవిధ్య పార్కుగా తీర్చిదిద్దవచ్చు' అంటారు రామమూర్తి.

మాంసాహార మొక్కలు

మనుషుల్లో మాంసాహారులూ శాకాహారులూ అన్న తేడా ఉన్నట్లే... మొక్కల్లోనే ఉంది. కొన్ని మొక్కలు కీటకాల్ని భోంచేస్తాయి. నెఫంథిస్, పిక్చర్ ప్లాంట్ అనే మాంసాహార మొక్కల్ని ఇక్కడ చూడవచ్చు. వీటి ఎదుగుదలకు నత్రజని అవసరం లేదు. కొన్నింటికి మినరల్ వాటర్ పోసి పెంచాలి. మిగతా వాటితో పోలిస్తే కాస్త ఖర్చుతో కూడిన వ్యవహారమే. అలాగే ఈ ఉద్యానవనంలో ఆధ్యాత్మిక వృక్షాలూ ఉన్నాయి. మనం ఏ రాశికి చెందుతామన్న దాన్ని బట్టి, మనం పూజించాల్సిన వృక్షాల్ని సూచిస్తుంది జ్యోతిషశాస్త్రం. ఆ ప్రకారం ఇక్కడ నవగ్రహ వనాలున్నాయి. ఇరవైనాలుగు వృక్ష జాతులతో కూడిన వినాయక వనం కూడా ఎంతో మందిని ఆకర్షిస్తోంది. తిరుగు ప్రయాణం అవుతూ ఉంటే... వెనుక నుంచి తీయని స్వరం... 'మళ్లీ ఎప్పుడొస్తారు?' అని పిలుస్తున్నట్లు కలకాదు నిజమే. భ్రమ కాదు వాస్తవమే. మాట్లాడేది మొక్కలే. మనసున్న చెవులకే వినిపిస్తుందా మాట!

(-వాసు, ఆంధ్రజ్యోతి, విశాఖపట్నంకు కృతజ్ఞతలు)

భోగవంతునికి భిక్షునికి
అనుసంధానమైనది
అంబికా దర్బార్‌బత్తి



బాడ్మింటన్ ఆటలో తెలుగు క్రీడాకారిణి

పి.వి.సింధు

తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది!

పార్థుడు తన చేతిలోని గాండీవాన్ని పరాక్రమంగా త్రిప్పినట్లు పి.వి. సింధు తన బాట్ ఆటలో విశ్వరూపం చూపించింది. విశ్వక్రీడాకారిణిగా వెలుగొందుతున్న ఆశాభావాన్ని కల్గించింది. బిడ్డా బ్యాట్ ఆటలో దొడ్డవనిపిస్తుండాలి. చదువుల్లో సరస్వతివి అనిపించాలి.

ఆమె ఆటను ఏమని వర్ణించగలం! ఆమె ఆధిపత్యాన్ని ఎంతని పొగడగలం... ఆమె షాట్లను! ఎలా కొలవగలం... ఆమె గొప్పదనాన్ని, ఈగెలుపు అనుభూతిని ఏ మాటల్లో చెప్పగలం...! ఒకటా... రెండా.. ఒక్క మ్యాచ్‌లో ఎన్ని పార్శ్వాలో... ఒక్క పోరులో ఎంత వైవిధ్యమో.. ఒక్క గంటలో ఎంతటి వింతల సమాహారమో...!

ఏమా రాకెట్ వేగం... ఏమా షటిల్ పరుగు... ఏమా స్మాష్‌లు... ఏమా స్ట్రోక్‌లు... ఏమా ఆధిపత్యం...! ఎక్కడా చూడని ఆట... ఎన్నడూ కనని పోరాటం.. ఎప్పుడూ కలగని అనుభూతి... అన్నింటికీ విజయ కారణం పూసర్ల వెంకట సింధు! మన మనసులు విరిసేలా చేసింది మన సింధు మెరిసింది. అలా ఇలా కాదు! బ్యాడ్మింటన్ కోర్టు బద్దలయ్యేలా... భారతావని ఆనందంలో ముంచెత్తిన క్రీడాకారిణి విజయ సింధు!

ఒలింపిక్ సెమీస్‌లో ఒకుహారను చిత్తు చిత్తు చేసింది.

మనతెలుగు బ్యాడ్మింటన్ తార పి.వి. సింధు చరిత్ర సృష్టించింది. రియో ఒలింపిక్స్ బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్‌లో ఫైనల్లోకి దూసుకెళ్లి రజతం ఖాయం చేసుకుంది. సెమీ ఫైనల్లో 9వ సీడ్ సింధు 21–19, 21–10తో ఆరోసీడ్ ఒకుహార (జపాన్)పై విజయం సాధించింది. తన కెరీర్‌లోనే అత్యుత్తమ ఫామ్‌లో ఉన్న సింధు అత్యంత కీలకమైన మ్యాచ్‌లో అదరగొట్టింది. రెండు నెలలుగా ఒలంపిక్స్ కోసం ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్న సింధు సెమీస్‌లో తన శక్తి సామర్థ్యాల్ని పూర్తిగా వినియోగించింది. బ్యాడ్మింటన్‌లో ఉన్న రకరకాల షాట్లను అద్భుతంగా ఆవిష్కరించింది. పూర్తిగా వ్యూహం ప్రకారం ఆడిన సింధు, ఒకుహార తమ శక్తియుక్తులన్నీ ప్రయోగించారు. ఐతే సింధు ప్రణాళికల ప్రకారమే మ్యాచ్ సాగింది. ర్యాలీ గేమ్‌తో ఒకుహారను కోర్టులో వెనుకవైపే ఉండేలా చేసింది. సుదీర్ఘ ర్యాలీలతో ప్రత్యర్థి అలసిపోయేలా చేసింది. తను అనుకున్న విధంగా గేమ్‌ను నడిపించడంలో సింధు పూర్తిగా విజయవంతమైంది. ఒకుహారను ర్యాలీలతో తీరికలేకుండా చేసిన సింధు చక్కని క్రాస్‌కోర్ట్ షాట్లు, నాణ్యమైన డ్రాప్‌షాట్లతో బోల్తా కొట్టించింది. షటిల్‌ను పూర్తిగా తన నియంత్రణలోనే ఉంచుకుంది. కాస్త నెమ్మదిగా వస్తే అంతెత్తుకు ఎగిరి స్మాష్‌లతో ఒకుహారను బెంబేలెత్తించింది. దీంతో ఆరంభం నుంచి సింధుదే ఆధిపత్యం. 11–6తో సింధు స్పష్టమైన ఆధిక్యంలోకి దూసుకెళ్ళింది. ఐతే ఒకుహార సైతం గట్టిగానే పోరాడింది. అద్భుతమైన షాట్లేవీ ఆడకపోయినా సింధు తప్పులు చేసేలా చేసింది. ఫలితంగా 19–18తో మ్యాచ్ ఉత్కంఠకు దారి తీసింది. ఈ సమయంలో ఒకుహర ఒత్తిడికి లోనవడం... సింధు మరింత పరిణతితో ఆడటంతో 20–18తో సింధు గేమ్‌కు చేరువైంది. సింధు రిటర్న్‌ను ఒకుహర నెట్‌కు కొట్టడంతో 21–19తో తొలి గేమ్ తెలుగమ్మాయి సొంతమైంది.

రెండో గేమ్‌లో సింధుది విశ్వరూపమే. కోర్టు మారడం, గాని వాటంలో మార్పుండటంతో మొదట్లో కాస్త తడబడింది. ఆమె అనవసర తప్పిదాలతో ప్రత్యర్థి రేసులో నిలిచింది. విరామ సమాయానికి 11–10తో సింధు ఆధిక్యంలోకి వెళ్ళింది అక్కడ్నుంచి సింధుకు ఎదురేలేదు. ఆమె రాకెట్‌కు అడ్డే లేదు. స్ట్రోక్‌లకు బదులే లేదు! స్మాష్‌లు.. హాఫ్ స్మాష్‌లులకు తిరుగులేదు! ఒక్కసారిగా వేగం పెంచిన సింధు అద్వితీయమైన ఆటతో చెలరేగింది! సింధు స్ట్రోక్‌లకు ఒకుహర దగ్గర సమాధానాలే లేవు. నెట్ దగ్గర టాప్... పుష్‌తో పాటు డ్రాప్ షాట్లతో వరుసగా పాయింట్లు రాబట్టింది. సింధు జోరు ముందు ఒకుహర చేష్టలుడిగిపోయింది. అప్పటికే బాగా అలసిపోయిన ఒకుహర కోర్టులో కదలలేకపోయింది. అసమాన ఆటతీరు ముందు పూర్తిగా తేలిపోయింది. ఒక్కో పాయింటుతో రెట్టించిన ఉత్సాహంతో కదంతొక్కిన సింధు.. వరుసగా 10 పాయింట్లు గెల్చుకుని ఒకుహారకు ఇంటిదారి చూపించింది. 49 నిమిషాల పోరాటంలో సింధు శభాష్ అనిపించుకోని సందర్భం లేదు. జేజేలు కొట్టించుకోని క్షణాలు లేవు. సింధు సింహ కిశోరమనిపించింది. వీర క్రీడాకారిణిగా మారిపోయింది.

స్వర్ణమే నా లక్ష్యం...

రియో ఒలింపిక్స్‌లో పతకం ఖాయమైనప్పటికీ అంతటితో సంతృప్తి చెందనని అంటోంది పి.వి. సింధు. స్వర్ణమే తన లక్ష్యమని చెబుతోంది.

పతకం ఖాయం చేసిన మ్యాచ్‌పై మీ విశ్లేషణ?

ఈ మ్యాచ్ సులువుగా సాగుతుందని ఏ దశలోనూ అనుకోలేదు. స్కోరు చూసి అంచనాకు రాదగ్గ మ్యాచ్ కాదిది. ర్యాలీలు సుదీర్ఘంగా సాగాయి. పాయింట్లు నేనే గెలిచినా వాటికోసం ప్రత్యర్థి చాలా శ్రమించేలా చేసింది. తొలిగేమ్ సాగిన తీరు చూస్తే ఎవరైనా గెలిచేలా కనిపించాం. నేను 18–17తో ఆధిక్యంలో నిలిచినప్పటికీ ఆమె పోరాటం ఆపలేదు. రెండో గేమ్‌లో 10 పాయింట్ల వరకూ సమానం సాగాం. విరామం తర్వాత నేను ఆధిపత్యం చెలాయించాను.

తొలిగేమ్ సొంతమయ్యాక మ్యాచ్ గెలవబోతున్నాని నమ్మారా?

ఆ నమ్మకం వచ్చింది కానీ.. ఏ దశలోనూ ప్రత్యర్థిని తేలిగ్గా తీసుకోలేదు. ఎప్పుడు ఏమైనా జరగొచ్చని అప్రమత్తంగా ఉన్నాను. ప్రతి పాయింటూ కీలకమే. అందుకే ఎక్కడా ఏకాగ్రత తప్పలేదు. ఆమె చాలా బాగా ఆడింది. అనవసర తప్పిదాలు చాలా జరిగాయి. నా కోచ్ నాలో పోరాట స్ఫూర్తి తగ్గకుండా చూశాడు. నేను తప్పులు చేస్తున్నప్పటికి వాటి గురించి ఆలోచించొద్దని చెబుతూ నన్ను అప్రమత్తంగా ఉంచాడు. ప్రతి పాయింట్ దగ్గరా జాగ్రత్తగా ఉన్నా.

ఒలంపిక్స్‌లో వ్యక్తిగత స్వర్ణం గెలిచిన ఏకైక భారత క్రీడాకారుడైన బింద్రా... తనకుతోడుగా రమ్మని ట్వీట్ చేశారు. దానిపై మీ స్పందన...

ఆయన కోరిక నెరవేర్చడానికి ప్రయత్నిస్తా. నా అత్యుత్తమ ప్రదర్శన చేస్తా. ఒలింపిక్స్‌లో ఆడటం గొప్ప అనుభూతి.

భారత్‌కు రియోలో తొలిపతకం అందించిన సాక్షి విషయంలో మీ స్పందన?

నేను సాక్షి మలిక్‌ను కలవలేదు. టీవీలో ఆమెను చూశా. రియోలో దేశానికి తొలి పతకం అందించిన ఆమెను తర్వాత కచ్చితంగా అభినందిస్తా. దేశం కోసం ఆమె గొప్ప ప్రదర్శన చేసింది.

రియోలో బరిలోకి దిగేముందు ఏ లక్ష్యంతో అడుగుపెట్టారు?

ముందు పతకం గురించి ఎక్కువ ఆలోచించలేదు. ఏ మ్యాచ్‌కు ఆ మ్యాచ్ మీద దృష్టి సారించాను. ఇదే ప్రదర్శన కొనసాగిస్తూ పోతే పతకం కచ్చితంగా వస్తుందని తెలుసు.

(ఈనాడుకు కృతజ్ఞతలు)



నల్లి ది గ్రేట్

నన్నింతవాడిని చేసింది చెన్నయ్ నగరమే

సజీవ పట్టు వస్త్ర వ్యాపార పెద్ద సామ్రాట్! దాన ధర్మాల్లో భోజ మహారాజు. కళాపోషణలో కృష్ణరాయలు! చెన్నయ్ మహానగరంలో ఆయన ప్రోత్సహించని సంగీత సభలు లేవు!

–లాకేత్వ (లే) మివ్వనేరని, 'ద'కును కొమ్ము (దు) ఇవ్వని దానశీలుడు!

రెండవ ప్రపంచ యుద్ధంలో అందరూ చెన్నయ్ విడిచిపోతున్నప్పుడు చిన్న వయస్కుడైన కుప్పుస్వామి మాత్రమే పానగల్ పార్కు ప్రాంతంలో ఉన్నాడు.

పార్కు అంత విశాలంగా తన వస్త్ర దుకాణాన్ని పెంపు చేశాడు.

తిరుమల తిరుపతి దేవస్థానముల (తిరుమల) అన్నసమారాధనకు తొలి విడతలోనే భూరి విరాళం యిచ్చాడు. త్యాగరాజనగర్ అభివృద్ధితోపాటు అభివృద్ధి చెందిన వస్త్ర దుకాణం నల్లి చిన్నస్వామిచెట్టి మెగా క్లాత్‌మాల్ వటుడింతయ్, ఆకాశమంతయ్ – అన్నట్లు త్యాగరాజనగర్‌లో అభివృద్ధి చెందింది.

1940లో నేను కాంచీపురంలో పుట్టాను. మా నాన్నగారి పేరు నల్లి నారాయణస్వామి చెట్టియార్. అమ్మ కన్నమ్మాళ్. మేం మొత్తం నలుగురం సంతానం. నా తరువాత ముగ్గురు చెల్లెళ్లు. నేను రెండు నెలల బిడ్డగా ఉండగా మా అమ్మ నాన్నలు మద్రాసుకు పూర్తిగా వచ్చేశారు.

టి.నగర్‌లో మొట్టమొదటి వస్త్ర దుకాణం మాదే

ఒకప్పుడు ధనికులంతా మైలాపూర్‌లో ఉండేవారు. అక్కడే ఐశ్వర్యవంతులు ఉద్యోగస్తులు, చదువుకున్నవారు జడ్జీలు వంటి వారంతా ఉండేవారు. వారంతా అప్పట్లో కామక్షి అమ్మవారి దర్శనం కోసం, పట్టుచీరల కోసం కంచికి వస్తుండేవారు. అలా పెరిగిన పరిచయాలతో కస్టమర్ల వద్ద ఆర్డర్లు తీసుకుని వారానికోమారు మా తాతగారు మద్రాసు వస్తుండేవారట. తరువాత ఆ ప్రయాణం వారానికి రెండుమార్లు పెరిగింది. అలా మద్రాసు నగరం వస్తుండటం వల్ల మగ్గం పని దెబ్బతింటోందని భావించి కుటుంబాన్ని కంచి నుంచి 1928లో మద్రాస్‌కు మార్చారు. మాంబళం రైల్వేస్టేషన్ సమీపంలో వున్న మంగేష్ వీధి, నెంబరు 11లో అద్దెకు దిగారట. టి.నగర్‌లో అద్దెకు ఇచ్చేందుకు అప్పట్లో ఇళ్లే ఉండేవి కావు. అతికష్టమ్మీద ఓ ఇంటిని అద్దెకు సంపాదించారు. రెండు పోర్షన్లు వున్న ఆ భవనంలో ఒకటే వంటగది. ఒక కుటుంబం వంట ముగిశాక మరొకరు చేసుకోవాల్సిన పరిస్థితి ఆ ఇంటి ముందున్న గదిలో గుడ్డలు పెట్టుకుని అమ్మేవారు.

ఇంట్లో పెట్టుకుని గుడ్డలమ్మితే వ్యాపారం విస్తరించదు. గుడ్డల అంగడి పెట్టుకోమంటూ స్నేహితులు ఇచ్చిన సలహాతో 1935లో నాగేశ్వరరావు రోడ్డులో తొలి దుకాణం వెలిసింది. ఇప్పుడు మా షాపు ఉన్న పక్క ఇంట్లోనే ఆనాడు వస్త్ర దుకాణం తెరిచారు. అది చిన్న దుకాణమే. అయితే టి. నగర్‌లో మొట్టమొదటి వస్త్ర దుకాణం మాదే. తరువాత ఉస్మాన్‌రోడ్డులో కె. రామచంద్రయ్య అండ్ కంపెనీ వారు జువెలరీ షాపు పెట్టుకున్నారు. రంగనాధన్ వీధి ఖాళీగా ఉండేది. తరువాతే అక్కడ కుంభకోణానికి చెందిన ధనపాల్ చెట్టియార్ స్టీలు సామాన్ల దుకాణం పెట్టుకున్నారు. అప్పట్లో ఏం వస్తువులు కావాలన్నా జార్జిటౌన్‌కు పోవాల్సిందే. నిజానికి రైల్వేస్టేషన్‌కు దగ్గరగా ఉంది కదా అన్న ఉద్దేశంతో మా తాత టి.నగర్‌లో దుకాణం తెరిచారు. ఆయన ముందుచూపు మాకు ఎంతో మేలు చేసింది. 1928 దాకా తాతగారే వ్యాపారం చూశారు. తరువాత 1928 నుంచి 35 వరకు మా మామగారు చూసారు. 1935 నుంచి మా నాన్నగారు కూడా వ్యాపార బాధ్యతలు చూసేవారు. 1948 నుంచి పూర్తిగా మా నాన్నగారే ఈ వ్యాపారాన్ని చేపట్టారు. ఆయనే ధైర్యంగా నిర్ణయాలు తీసుకుని వ్యాపారాన్ని అభివృద్ధి చేశారు. మా దుకాణం ఉన్న భవనాన్ని కొనుగోలు చేశారు.

అలనాటి టి. నగర్

1948 నుంచి నాకు మదరాసు నగరం బాగా గుర్తుంది. అప్పట్లో నెంబరు 10 పాండిబజార్‌లో మా ఇల్లు ఉండేది. మా ఇంటిపక్కనే ప్రముఖ క్రికెటర్ సీడీ గోపీనాథ్ ఉండేవారు. ఆరేళ్ల వయస్సులో నేను ఒంటరిగా పనగల్ పార్కులోని మా షాపువరకు నడచివచ్చేవాణ్ణి. రోడ్లపై వాహనాలు కనిపించేవి కావు. ఎప్పుడో గంటకొక కారు కనిపిస్తే ఎక్కువ. అప్పట్లో టి. నగర్ బస్టాండు లేదు. శివాలయం ముందు ఒక స్టాండు వుండేది. కేవలం ఐదు బస్సులు మాత్రమే తిరుగుతుండేవి. 9వ నెంబరు బస్సు ఎగ్మూరు మీదుగా వెళ్లేది. 10వ నెంబరు బస్సు ఎగ్మూరు

1956లో రామకృష్ణ మిషన్ పాఠశాలలో కుప్పుస్వామి చెట్టి (వృత్తాకారంలో)

వరకు వెళ్లేది. 11వ నెంబరు ప్యారీస్, 12 వ నెబరు మైలాపూరు, 13 లాయడ్స్ రోడ్డు వరకు వెళ్లేవి. ఒక బస్సు పోతే 40 నిమిషాల వరకు బస్సు ఉండేది కాదు. ఆ బస్సుల్లో కూడా 10-20 మందే ఉండేవారు.

పాండీ బజారు పేరు అది కాదు

టి.నగర్ వ్యాపారకేంద్రంగా మారిన చాలా కాలం తరువాత పాండీ బజారు ప్రాంతాన్ని ఒక బజారుగా డిక్లేర్ చేశారు. దాని అసలు పేరు అది కాదు. 'సర్ త్యాగరాయ రోడ్' ఇప్పటికీ కార్పొరేషన్ రికార్డుల్లో త్యాగరాయరోడ్ అనే వుంటుంది. శ్రీనివాస్‌రోడ్ కార్నర్ నుంచి ఇప్పటి గీతాకేఫ్ వరకే దేవరాజ్ మొదలియార్ అనే ఆయన ఒక భవనంలో 12 షాపులు కట్టాడు. ఆయనది పాండిచ్చేరి దాంతో ఆ బిల్డింగ్‌పైన పెద్ద బల్బు పెట్టి 'పాండీ బజార్' అనే పేరు పెట్టాడు. తరువాతి కాలంలో ఆ రోడ్డుకు పాండీబజార్ అనే పేరు వచ్చేసింది. అక్కడికి సమీపంలోని రాజకుమారి థియేటర్ ఎదురుగా నూనె గానుగ ఉండేది. అక్కడికి తరచూ వెళ్ళి పాత్రలో నూనె కొని తెచ్చేవాణ్ణి. నన్ను ఇప్పటికీ వెంటాడే జ్ఞాపకం అది. ఆ గానుగను నా మనవళ్లు, మునిమనవళ్లకు చూపించి ఇదీ నా బాల్యం అని చెప్పాలని ఆశగా ఉంటుంది. కనీసం దాని ఫోటోలు దొరికినా సంతోషమే. ఆ గానుగ ఫోటోలు ఎవరిదగ్గర వున్నా ఎంత ఖరీదైనా కొనుక్కోవడానికి సిద్ధంగా ఉన్నాను. ప్రస్తుతం పాండీబజారులో జీఆర్‌టి హోటల్ వున్న ప్రాంతంలో హోలీ ఏంజిల్స్ బాలికల పాఠశాల ఉండేది. 2వ ప్రపంచ యుద్ధ కాలంలో నగరంపై బాంబులు వేస్తారన్న భయం ఉండేది. ఆ భయంతో మద్రాసు హైకోర్టును హోలీ ఏంజెల్స్ బాలికల పాఠశాలలో నడిపారు.

ఒంటెద్దు బండిపై బడికి

1945లో నా చదువు మొదలైంది. ఎస్సెస్సెల్సీ వరకు రామకృష్ణ మిషన్ స్కూళ్లలోనే సాగింది. 1 నుంచి 3 వరకు ఉస్మాన్‌రోడ్డులో ఉన్న రామకృష్ణ స్కూలులో చదివాను. పాండీ బజారు నుంచి మా ఇల్లు ఇప్పుడున్న దుకాణంపైకి మారిన తరువాత ఒంటెద్దు బండిపై స్కూలుకు వెళ్ళివచ్చేవాణ్ని. తరువాత సైకిలు తీసియిచ్చారు. అప్పట్లో స్కూల్లో హిందీ తప్పనిసరి. సంస్కృతం ఐచ్ఛికంగా ఉండేది. అందుకే ఇప్పటికీ హిందీ ధారాళంగా మాట్లాడగలను. ఉత్తర భారతదేశం నుంచీ వచ్చే కస్టమర్లతో మాట్లాడేందుకు అది ఎంతో దోహదపడింది. మొదటి నుంచి లెక్కల్లో నేను ఫస్ట్. టీచర్ ఒక లెక్క బోర్డుపై మొదలు పెట్టేటప్పటికి నేను పూర్తి చేసేవాడిని. దాంతో నా కోసం మరో లెక్క చెప్పేవారు. 40 మంది వున్న తరగతిలో ప్రశంసలు వస్తే ఎంత గర్వంగా ఉంటుంది? మా టీచర్ స్కూలు బయట ఎక్కడైనా కనిపిస్తే నా గురించి చాలా గొప్పగా చెప్పేవారు.

16ఏళ్లకే వ్యాపార బాధ్యతలు

1953లో మా నాన్నగారు చనిపోయారు. దాంతో ఎసెల్సీతోనే నా చదువు ఆగిపోయింది. 16 ఏళ్లకే షాపు బాధ్యతలు చేపట్టాల్సి వచ్చింది. అప్పటిదాకా నాకు దుకాణం వ్యవహారాలు తెలియవు. మొదట్లో షాపు ఊడ్చేవాడిని. తరువాత ప్యాకింగ్, ఆ తరువాత కౌంటర్‌లో కస్టమర్లను రిసీవ్ చేసుకోవడం, తరువాత చేనేతవారి నుంచి వచ్చిన దుస్తులను పరిశీలించడం, తరువాత క్యాష్ కౌంటర్. ఇలా ఒక్కో భాగం చూసుకుంటూ వచ్చాను. చెక్కుపై సంతకం చేయడానికి నా వయస్సు సరిపోయేది కాదు. మా చిన్నాన్న రంగస్వామి చెట్టియార్ గార్డియన్‌గా వుండి ఆ వ్యవహారాలు చూసేవారు. అన్ని స్థాయిల్లో పనిచేయడం వల్ల షాపులో మంచి చెడులన్నీ నాకు తెలుసు. ఇప్పటికి 'చెట్టినాడు వంటి పెద్ద సంస్థల్లో ఆ విధానం వుంది.

12 రూపాయలకే పట్టుచీర

1956లో రోజుకు మహా అయితే 70-75 మంది కస్టమర్లు వచ్చేవారేమో! ఇప్పుడు వెయ్యిమందికి పైనే వస్తారు. అప్పట్లో పనివేళలు కూడా తక్కువే. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 దాకా, సాయంత్రం 4 నుంచి 8 గంటల దాకా మాత్రమే షాపు ఉండేది. రాత్రి 7 దాటిందంటే కస్టమర్లు ఎవ్వరూ వచ్చేవారు కారు. ఊరక ఏం కూర్చుంటాంలే అని మేమే షాపు తెరచి వుంచేవారం. అప్పట్లో పట్టుచీరలు కొనుగోలు చేసేవారు కూడా తక్కువే! నాకు తెలిసి 1946లో పట్టుచీర 12 రూపాయలు. 1956లో అదే చీర 60 రూపాయలకు పెరిగింది. ఇప్పుడు వేలల్లోకి వెళ్ళిపోయింది. మా తరువాత టి.నగర్ పట్టుచీరల దుకాణం పెట్టింది కుమరన్ సిల్క్స్ వారే. 1968లో వారు షాపు ప్రారంభించారు. 1958లో నా వివాహమైంది. ఇద్దరు అబ్బాయి. ఇద్దరు అమ్మాయిలు.

సినిమా నగర్

ఒకప్పుడు దేశంలో సినీ కేంద్రాలుగా ముంబాయి, మద్రాస్ పేర్లే చెప్పేవారు. టి.నగర్‌లో సినిమావాళ్ళు ఎక్కువగా ఉండేవారు. పట్టణానికి దూరంగా, విశాలంగా ఉంటునందున్న ఉద్దేశంతో సినిమావాళ్ళు ఇక్కడ స్థిరపడ్డారు. ఎంతోమంది ప్రముఖులు కూడా ఉండేవారు. తరూత కోడంబాకానికీ సినిమావాళ్ళు విస్తరించారు. కోడంబాక్కం అసలు పేరు 'ఘోడాబాగ్' హిందీలో ఘోడా అంటే గుర్రం. గుర్రాలు ఎక్కువగా ఉన్న ప్రాంతం కాబట్టి దానిని ఘోడాబాగ్ అనేవారు. అయితే కాలక్రమేణా ఆ ప్రాంతం కోడంబాకంగా మారిపోయింది.

రెండో ప్రపంచ యుద్ధ కాలం

అప్పట్లో మా షాపు ముందు పెద్దగా వాహనాలు కనిపించేవి కావు. అన్నీ ఎడ్ల బండ్లు, జట్కాబండ్లు ఉండేవి. దాంతో రోడ్డంతా పేడమయంగా ఉండేది. కార్మికులు ప్రతిరోజూ నీళ్ళతో రోడ్డును కడిగేవారు. 2వ ప్రపంచ యుద్ధం వచ్చినప్పుడు ఇక్కడంతా సైనికులు ఉండేవారు. అప్పుడప్పుడూ సైరన్లు మ్రోగుతుండేవి. యుద్ధం

1951లో చిన్నస్వామి చెట్టి గృహప్రవేశ సందర్భంలో...

50వ దశకంలో రంగనాథన్ వీధి

ముగింపు సమయం నాకు గుర్తుంది. ఎప్పుడు ఏ క్షణంలో యుద్ధం వస్తుందో అని ప్రజలు హడలిపోతుండేవారు. బాంబులు పడితే మంటలు చల్లార్చేందుకు ఎక్కడికక్కడ నీరు భద్రపరచుకునేవారు. పెద్ద గుంటలు తీసి అందులో నీటిని నింపి మూసేసేవారు. ఆ మూతకు ఒక చిన్న రంధ్రం వేసి, గుర్తుగా సున్నంతో 'ఎఫ్‌హెచ్' అని రాసిపెట్టేవారు. అలా నిల్వచేసిన నీటితోనే రోడ్లపై వున్న పేడను కడిగేస్తుండేవారు. రోడ్లపై పేడ ఎండిపోయి వుంటే ముందుగా నీళ్ళు చల్లేవారు. తరువాత దానిని శుభ్రంగా కడిగి ఊడ్చేవారు. రోడ్లను చాలా శుభ్రంగా ఉంచేవారు. కాని ఇప్పుడు ఇంత టెక్నాలజీ వచ్చినా అంత శుభ్రంగా ఉంచలేకపోతున్నారెందో అర్థం కాదు. నీటి కోసం గుంటలతోపాటు పెద్ద పెద్ద బావులు కూడా తవ్విపెట్టేవారు. జీఎన్ చెట్టి రోడ్డులో ఉన్న కన్నదాసన్ విగ్రహం ఎదురుగా ఒక పెద్ద బావి ఉండేది. ఆ నీటిని చుట్టుపక్కల వారు సాధారణ అవసరాల కోసం కూడా వినియోగించేవారు. అలాగే ఉస్మాన్‌రోడ్డులో రామనాధన్ వీధి చివర్లో కూడా ఒక బావి తవ్విపెట్టారు.

ఎకరా రూ.2 వేలు

అప్పట్లో టి.నగర్‌లో అన్ని ఇళ్ళు విడివిడిగా ఉండేవి. ఒక్కో ఇల్లు ఒక్కో ఎకరా స్థలంలో ఉండేది. టి.నగర్‌లో తొలిగా ఇల్లు నిర్మించింది జీఎన్ చెట్టిరోడ్డులో. 1923లో మామన్ మాప్పిళ్లై అనే ఆయన ఎకరా స్థలంలో ఇల్లు నిర్మించారు. వారే ఎంఆర్‌ఎఫ్ సంస్థ వ్యవస్థాపకులు. అప్పట్లో నిర్మించిన భవనం ఇప్పటికీ అలానే ఉంది. జైన్ ఆలయం పక్కనే వున్న మామన్ మాప్పిళ్లై బంగళానే అది. ఒక ఎకరాను రూ.2 వేలకు కొనుగోలు చేశారు. అందులో 5 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు కడితే 3 వేల రూపాయలు ఖర్చయినట్లు వారు నాతో చెప్పారు. అంటే టి.నగర్‌లో పెద్ద ఇల్లు నిర్మించుకునేందుకు వారికి అయిన ఖర్చు మొత్తం రూ.5 వేలు. ఇప్పుడున్న మా షాపు భవనాన్ని 1950లో మా నాన్నగారు ఆరున్నర గ్రౌండ్ల స్థలమును 55 వేల రూపాయలకు కొనుగోలు చేశారు.

అణాకు ఒక దోసె

టి.నగర్ సోషల్ క్లబ్ కోసం 1930లో స్థలం కేటాయించారు. అప్పట్లో గ్రౌండ్ రూ. 200. మొత్తం 14 గ్రౌండ్లు కొనుగోలు చేశారు. 1935లో ఈ భవనానికి కుమారరాజా ముత్తయ్య చెట్టియార్ శంకుస్థాపన చేశారు. 1939లో దానిని రాజాజీ ప్రారంభించారు. ఆ క్లబ్‌లో ఓ క్యాంటీన్ కూడా ఉండేది. చుట్టుపక్కల వారంతా అక్కడ చేరేవారు. నాకు ఊహ తెలిసి ఒక అణాకు దోసె ఇచ్చేవారు. అంటే రూపాయికి 16 దోసెలు వచ్చేవన్నమాట. ఇడ్లీ అర అణా, కాఫీ ఒక అణా ఉండేది. నాకు పాకెట్‌మనీగా నాన్నగారు 4 అణాలు ఇచ్చేవారు. దాంతో నా స్నేహితులతో కలిసి ఆ క్యాంటీన్‌లో ఇడ్లీ, దోసెలు సంతృప్తిగా తినేవాణ్ని.

'నాయుడు హాల్' కథ

టి.నగర్‌లో నిజం చెప్పాలంటే మద్రాసులోనే మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటయిన షాపు నాయుడు హాలు. ఎం. గోవిందస్వామినాయుడు ఆ షాపు ఏర్పాటు చేశారు. గుడియాత్తంకు చెందిన ఆయన ఇంట్లో అలిగి ట్రైన్ ఎక్కి చెన్నై వస్తుండగా టిక్కెట్ కలెక్టర్ పట్టుకున్నారట. ఫైన్ కట్టేందుకు డబ్బులు లేకపోవడంతో విషయం తెలుసుకున్న ఓ ముస్లిం ఆ డబ్బు కట్టేశాడు. అసలు విషయం తెలుసుకున్న ఆ ముస్లిం గోవిందస్వామినాయుడును బెంగుళూరు తీసుకెళ్లి టైలరింగ్ శిక్షణ ఇచ్చాడట. అక్కడ తర్ఫీదు పొందిన అనంతరం 1939లో చెన్నై వచ్చిన ఆయన రాఘవయ్యవీధిలోని ఓ కారు షెడ్డులో తొలిగా టైలరింగ్ దుకాణం పెట్టారు. కస్టమర్లు పెరగడంతో పాండీ బజారులో కొంచెం పెద్ద షాపు పెట్టారు. తరువాత మహిళల కోసం ప్రత్యేకంగా రెడీమేడ్ షాపు పెట్టారు. అదే ఇప్పుడు నగరంలో ప్రసిద్ధి చెందిన నాయుడు హాల్. ఆ షాపు అభివృద్ధిలో గోవిందస్వామినాయుడు సతీమణి జయలక్ష్మిగారి పాత్ర కూడా ఎంతో ఉంది. అప్పట్లో టి.నగర్‌లో పెద్దగా హోటళ్లు ఉండేవి కావు. దాంతో దూర ప్రాంతాల నుంచి నాయుడు హాలుకు వచ్చిన కస్టమర్లు ఆయన ఇంట్లోనే భోజనాలు చేసేవారు. అందువల్ల జయలక్ష్మిని

అందరూ 'అన్నలక్ష్మి' అనేవాళ్ళు.

గాంధీ పాదం మోపిన మా ప్రాంతం

జాతిపిత గాంధీజీ పాదం మోపిన ప్రాంత టి.నగర్. హిందీ ప్రచార సభ నుంచి మా దుకాణం మీదుగా ఆయన నడిచివచ్చేవారట. చుట్టూ జనాలు ఉండేవారు. 1946లో వెంకట నారాయణ రోడ్డులోని టక్కర్ బాబా విద్యాలయానికి సంబంధించిన కొత్త భవనాలను గాంధీజీ ప్రారంభించారు. అది నాకు బాగా గుర్తుంది.

మద్రాస్‌లో తొలి బెంజ్ కారు నాదే

ఉమ్మడి కుటుంబంగా వున్నప్పుడు 1938లో కారు తీసుకున్నాం. దానిని కంచిలో మా తాతగారు వినియోగించేవారు. 1949లో మా నాన్నగారు స్వంతంగా సెకండ్‌హ్యాండ్ కారు కొన్నారు. 1950లో ఫోర్డ్ కారు తీసుకున్నాం. 1991లో తొలి బెంజ్ కారు నేనే తీసుకున్నాను.

తెలుగువాళ్ళే ఎక్కువ

ఉస్మాన్‌రోడ్డులో వున్న అనేక భవనాలకు పేర్లు మారాయి. కానీ వీధుల పేర్లు మాత్రం చాలా వరకు పాతవే కొనసాగుతున్నాయి. ఉత్తర బోగ్‌రోడ్డుకు నాగిరెడ్డి సోదరుడు బీఎన్‌రెడ్డి సాలై అని పేరుపెట్టారు. దక్షిణ బోగ్ రోడ్డుకు నడిగర్ తిలకం శివాజీగణేశన్ పేరు పెట్టారు. ఆయన జీవించి ఉన్నప్పుడే 'శివాజిగణేశన్ సాలై' అని పేరు మార్చారు. బీఎన్‌రెడ్డి వీధి నుంచి గాంధీమతి కళ్యాణమడపం మీదుగా శివాజీగణేశన్ వీధి వరకు వస్తుంటే పలు కల్యాణ మండపాలు ఉండేవి. అక్కడ అనేక భవనాలు, వాణిజ్య సంస్థలు ఉండేవి. అందులో తెలుగు మాట్లాడేవారే అధికంగా ఉండేవారు. బీఎన్ రెడ్డి రోడ్డులోని పండ్ల దుకాణం ఎదురుగా ఉండే వెంకట్రామన్ వీధిలో అప్పట్లో తెలుగు సినీ ప్రముఖుల నివాసాలు ఉండేవి. ప్రస్తుతం అక్కడ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, ప్రైవేటు సంస్థల భవనాలున్నాయి. ప్రస్తుతం నాగేశ్వరరావు వీధిలోని కుమరన్ లైఫ్ సిల్క్స్ షోరూమ్ వున్న ప్రాంతంలో పెట్రోలు బంక్ ఉండేది. అప్పట్లో పెట్రోలు కూడా రేషన్ విధానంలోనే ఇచ్చేవారు. మా తాతగారి కారులో కాంచీపురం వెళ్ళాలంటే పెట్రోల్ కోసం మా చిన్నాన్న రంగస్వామిచెట్టి పరిచయాల వల్ల కొంతమంది రేషన్‌ను కూడా మేం ఉపయోగించుకునేవాళ్లం.

టి.టి.డి. కేంద్రం కన్నయ్యశాస్త్రిగారిది

వెంకటనారాయణ రోడ్డులోని టిటిడి చెన్నై సమాచార కేంద్రం ఏర్పాటు చేసిన స్థలం కల్నల్ శాస్త్రి అనే ఆయనకు చెందినది. ఆయన శ్రీమతి మా దుకాణానికి రెగ్యులర్‌గా వస్తుండేవారు. చిన్నప్పుడు ఆమె మాకు చాక్లెట్లు ఇచ్చేవారు. తరువాతి కాలంలో ఆ స్థలం కావాలా అని ఆమె నన్ను అడిగారు. కానీ అంతగా ఆసక్తిగా లేక దానిని తీసుకోలేదు. ఆ తరువాత టిటిడీవారు దానిని కొనుగోలు చేశారు. వెంకటనారాయణ రోడ్డులో వున్న మరో ఆధ్యాత్మిక కేంద్రం శ్రీశృంగేరి శారదాపీఠం ధ్యాన కేంద్రం. ఆ కేంద్రం వున్న స్థలం డాక్టర్ రామయ్యంగార్‌కు చెందినది.

(తరువాయి 12వ పేజీలో)



ప్రముఖాంధ్ర ఉన్నంత వరకూ నేనుంటాను!

ప్రతీ తెలుగువానిలో తెలుగును విరబూయించే కృషి చేస్తాను!

చెన్నపట్నం చెరుకు గడ. చెరుకుగడ కణుపు కణుపు మధ్య తీపిదనం ఉన్నట్టు తెలుగుదనం కణుపు కణుపునా ఉన్నది. అందించడం మా వంతు. ఆస్వాదించడం మీ వంతు! పెట్టీ బేడా సర్దుకుని 1954లో చెన్నపట్నం చేరాను. చెన్నపట్టణంలో అణువణువునా తెలుగుదనపు తీపి ఆస్వాదించాను. 1956 వచ్చేసరికి తెలుగువారు ఆంధ్ర నినాదంతో కర్నూలు వెళ్లిపోయారు. అక్కడ ఒక సంవత్సరమే ఉన్నారు. అక్కణ్ణుంచీ ఆంధ్రప్రదేశ్ నినాదంతో హైదరాబాదు వెళ్ళిపోయారు.

నేను మాత్రం నా చిరునామా ఇదేనని చెన్నపట్నంలో ఉండిపోయాను.

చెరుకుగడ వంటి చెన్నపట్టణంలో కణుపు కణుపునా తెలుగుదనపు తీపిదనం ఉందని ముందే చెప్పాను. ఇది బంగారు తీగపు చెరుకు గడ. ఇది ఆంధ్రలోనే లభ్యమవుతుంది. ఇక్కడనే నుండి ఆ బంగారపు చెరుకుగడ తీపిదనాన్ని ప్రపంచ దేశాల్లోని తెలుగువారికి అందించే ప్రయత్నం చేస్తున్నాను. 1956 సంవత్సరములోనే ఇందుకు పట్టుదిట్టమైన సిమెంటు రాట్లు వేయగలిగాను! ఎంతెంతటి గాలివానలూ, వాయుగుండాల తాకిడి యేర్పడినను నేను నాటిన తెలుగు పందిరిరాట్లకు ప్రమాదం కలుగలేదు.

గత ఇరవై మూడు సంవత్సరాలనుంచీ 'ప్రముఖాంధ్ర' పరిపుష్టికరంగా వెలువడుతూనే ఉంది. భవిష్యత్తులోకూడా ప్రమాదం కలుగకుండా నా పెద్ద కుమారుడు వేంకటేశ్వరరావు మార్గనిర్దేశనం చేసాడు.

నా కుమారులూ, వాడి తమ్ములైన నారాయణరావు, నాగసాయి ప్రసాద్‌లు వెన్నుదన్నుగా నిలిచారు.

నాకు చింత యేముంది? చిన్తారహితుడను! చిన్మయానందనందభరితుడను. చిరంజీవిని కాననే భయంలేదు; చిరకాలమూ ప్రముఖాంధ్ర వెలువడితే నాకదే చాలు!

– గోటేటి శ్రీరామారావు

*(11వ పేజీ తరువాయి)*డాక్టర్ నటేశన్ పార్కు ఉత్తరం వైపు యూఎల్ నారాయణరావు అనే ఆయనకు చెందిన పెద్ద భవనం ఉండేది. అందులో ఎక్కువగా షూటింగులు జరుగుతుండేవి. 1929లో రంగనాథన్ వీధిలో శ్రీరామకృష్ణస్వామి శర్మ అనే ఆయన 'లిఫ్కో లిటిల్ ఫ్లవర్ కంపెనీ' స్థాపించారు. ఉత్తమ గ్రంథాల ముద్రణ, పంపిణీకి ఆ సంస్థ పేరు మోసింది. ఇప్పుడది పశ్చిమ సీఐటీ నగర్‌లోని నంది విగ్రహం సమీపంలోకి తరలిపోయింది.

తెలుగు కార్మికుల పేర్లతో రెండు వీధులు

మా తాతగారికి 1906 నుంచి చెన్నైతో అనుబంధం వుంది. అప్పటికి టి.నగర్ లేదు. మా తాత తాను ఎరిగిన టి.నగర్ ప్రాంతం గురించి నాకు చెప్పేవారు. అప్పట్లో ఇదంతా పెద్ద చెరువు. దానిని లాంగ్ లేక్ అని పిలిచేవారు. మాంబళం రైల్వేస్టేషన్ నుంచి లయోలా కాలేజీ వరకు పొడవుగా అంతా చెరువే! చెరువుని ఆక్రమించుకుంటూ ఇళ్లు నిర్మించుకున్న ప్రాంతమే టి.నగర్. 1923లో టి.నగర్ పుట్టింది. అప్పట్లో ఇదొక చిన్న గ్రామం లాంటిది. పానగల్ రాజావారు దీనిని ప్రారంభించారు. అందుకే ఆయన పేరుతో పనగల్ పార్కు ఏర్పడింది. టి.నగర్ రాక ముందు ఈ ప్రాంతం పేరు మాంబళం. ఇప్పటికీ రైల్వేస్టేషన్‌కు అదే పేరు వుంది. సుబ్రమణ్యన్ అయ్యర్ అనే ఆయన మాంబళం రైల్వేస్టేషన్ మాస్టరుగా ఉండేవారు. ఆయనకు వంద ఎకరాల స్థలం వుంది. ప్రస్తుతం మాంబళం బస్టాండు నుంచి బర్కిట్ రోడ్డు మీదుగా వెంకటనారాయణ రోడ్డులో తిరిగి మౌంట్‌రోడ్డు దాటి, దక్షిణ ఉస్మాన్ రోడ్డు వరకు ఆ స్థలం ఉండేది. ఇక్కడ పెద్దగా మానవ సంచారం లేకపోవడం, పట్టించుకునేవారు లేకపోవడంతో ఆ స్థలాన్ని ఆయన వంతుల వారీగా అమ్మేశారు. మద్రాసులో మురుగునీటి కాలువ వ్యవస్థ, నీటి సరఫరాతో ఏర్పడిన మొట్టమొదటి ప్రాంతం త్యాగరాయనగర్. అంతకు ముందే జార్జిటౌన్ ప్రాంతం, మైలాపూర్ ఉన్నా, వాటికి డ్రైనేజీ వ్యవస్థ ఉండేది కాదు. టి.నగర్ ప్రారంభోత్సవం తరువాత జరిగిన పనుల్లో ఆంధ్రా ప్రాంతం నుంచి వచ్చిన నాదముని, గోవిందు అనే తెలుగువారు చనిపోయారు. అందుకు గుర్తుగా రెండు వీధులకు వారి పేర్లు పెట్టారు. అవే నాదముని స్ట్రీట్, గోవిందన్ స్ట్రీట్.

చిన్నమగ్గాల పేట చింతాద్రిపేట

ఒకప్పుడు మదరాసు అంటే జార్జిటౌన్ ప్రాంతమే. బ్లాకర్స్ టౌన్, ముత్యాలపేట అని కూడా అనేవారు. 1911లో బ్రిటీషుపాలకుడు కింగ్ జార్జి వచ్చిన సందర్భంగా సత్కారం చేసి ఆ ప్రాంతానికి ఆయన పేరు పెట్టారు. తరువాత చింతాద్రిపేట విస్తరించింది. దాని పూర్తిపేరు తమిళంలో 'చిన్నతరిపేట' అంటే తెలుగులో చిన్నమగ్గాల పేట అని అర్థం. ఆ తరువాతే టి.నగర్ వచ్చింది. సర్ పిట్టి త్యాగరాయ చెట్టియార్ పేరే ఈ ప్రాంతానికి పెట్టారు. అదే విధంగా గోపతి నారాయణస్వామి చెట్టి రోడ్, వెంకట నారాయణ రోడ్, నాగేశ్వరరావు రోడ్, ఇవన్నీ తెలుగువారివే. అలాగే బర్కిట్ రోడ్డు, బజుల్లా రోడ్డు, బోగ్ రోడ్ ఇలా వీధులకు నాటి ఇంజనీర్ల పేర్లు పెట్టారు. టి.నగర్‌కు ఇంజనీర్లు చేసిన సేవలకు గుర్తుగా వీధులకు ఇంజనీర్ల పేర్లు పెట్టడం విశేషం. టి.నగర్‌లోని వీధులన్నీ తెలుగువారు, ఇంజనీర్లు, జస్టిస్ పార్టీ నేతల పేర్లతోనే ఉంటాయి. తెలుగువాడైన సర్ పిట్టి త్యాగరాయ చెట్టి కూడా జస్టిస్ పార్టీకి చెందిన నేత. ఆయన పేరే ఈ ప్రాంతానికి పెట్టడం విశేషం. మద్రాసుకు మొదటగా ట్రామ్‌లే వచ్చాయి. ఆ తరువాతే బస్సులు నడిచాయి. లండన్‌లో ట్రామ్‌లు నడిపిన తరువాత 1911లో మద్రాసులోనూ ప్రవేశపెట్టారు. తరువాతే అమెరికాకు వెళ్లాయట. టి.నగర్ ఆలస్యంగా అభివృద్ధి చెందింది కాబట్టి ఇక్కడికి ట్రామ్‌లు రాలేదు. జార్జ్‌టౌన్, ట్రిప్లికేన్, మైలాపూరు, పురసవాక్కం వైపే ట్రామ్‌లు తిరిగాయి.

ప్రాంతాలు మారిన 'వ్యాపారం'

మద్రాసు పట్టణంలో 1895–1915 వరకు జార్జ్ టౌన్ ప్రాంతం వ్యాపార కేంద్రంగా ఉండేది. 1915–29 కాలంలో చింతాద్రి పేటలో మార్కెట్ నడిచింది. అనంతరం 1929–39 కాలంలో ట్రిప్లికేన్, 1939 నుంచి 1950 వరకు మైలాపూరు వ్యాపార కేంద్రాలుగా ఉన్నాయి. 1951 నుంచి టి.నగర్ మార్కెట్ పెరిగింది. అది ఇప్పటికీ కొనసాగుతుందంటే అదీ దేవుడి దయే! – **ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు**

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

మార్చాలి గానీ... మనం మారకూడదు

చిరునగవుల జమున హంపీ కన్యలానే ఉంటుంది!!

సినీ రంగంలోకి వచ్చిన వారికి ఇబ్బందులు ఎదురు కావడం సహజం. ఏదోరకంగా ఆడవారిని అణగదొక్కాలని ప్రయత్నిస్తారు. నేను, భానుమతి లాంటి కొందరు మాత్రం అన్నింటినీ తట్టుకుని నిలబడ్డాం. షూటింగ్‌లో నా హద్దుల్లో నేను ఉండేదాన్ని. మేకప్ వేసుకోవడం, నటించడం... ప్యాకప్ చెప్పగానే ఇంటికి వెళ్ళిపోవడం... అంతవరకే! అనవసరంగా ఎవరో ఒకరితో మాటలు కలపడం నాకు ఇష్టం ఉండేది కాదు. 'నా ఆత్మాభిమానం నేనే కాపాడుకోవాలి' అని నాకు నేనుగా అనుకున్నాను. ఆత్మాభిమానాన్ని చంపుకుని ఏ పనీ చేయనక్కర్లేదు అని ప్రతివారూ అనుకుంటే ఏ రంగంలోనైనా వ్యక్తిత్వంతో నిలబడగలుగుతారని నా అభిప్రాయం. వ్యక్తిత్వానికి ఆటంకం కలిగేలా ఉంటే కెరీర్‌ను వదులుకోవడానికి కూడా నేను ఎప్పుడూ సిద్ధంగా వుండేదాన్ని.

నేను సెట్‌లో ఉంటే అందరూ జాగ్రత్తగా ఉండేవారు...

నాకు చిన్నప్పటి నుంచి క్రమశిక్షణ అలవాటు చేశారు నాన్నగారు. సెట్‌లో అనవసరంగా నవ్వితే ఆయన ఊరుకునేవారు కాదు. మర్యాదగా ప్రవర్తిస్తూ షూటింగ్ పూర్తి చేసుకుని రావాలనే నేర్పారు. అది నా మంచికే అని తెలిసింది. ఇంట్లో మాత్రం అందరం సరదాగా నవ్వుతూ తుళ్లుతూ ఉండేవాళ్ళం. నా వ్యక్తిత్వానికి భంగం కలిగేలా ఉంటే నేను సహించలేను. పెద్ద పెద్ద హీరోలు కూడా నేను షూటింగ్‌లో ఉంటే చాలా మర్యాదగా ప్రవర్తించేవారు. ఒక రోజు షూటింగ్‌లో నేను లేననుకుని, ఒక పెద్ద హీరో మద్యం సేవించి వచ్చారు. సాధారణంగా సినిమాలో హీరో తప్పించి, మిగిలిన పాత్రలలో ఎలా నటించినా మద్యం వాసన మనకు తెలియదు. కాని హీరోలతో కొన్ని సీన్స్‌లో చాలా క్లోజ్‌గా నటించాల్సి ఉంటుంది. అలాంటి సమయంలో వారి నోటి నుంచి వచ్చే మద్యం వాసన భరించడం ఎవరికైనా కష్టమే. అందుకే ఆ రోజు నేను షూటింగ్ చేయనని చెప్పేశాను. అప్పటికే ఒక అమ్మాయిని పట్టుకుని కౌగలించుకుని, ముద్దుపెట్టుకున్నారుట ఆ హీరో. ఆ సందర్భంలో నేను ఉండి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదని సెట్‌లో అందరూ నాతో అన్నారు. ఆ మాటలకు నాకు సంతోషం అనిపించింది. నేను ఉండటం వల్ల సెట్‌లో క్రమశిక్షణ ఉంటుంది అని అందరూ అనుకోవడం నాకు గర్వ కారణమే కదా! వాస్తవానికి నేను – ఆ హీరో కాంబినేషన్ చాలా బావుంటుందని అందరూ అనుకునేవారు. మాది హిట్ పెయిర్ కూడా.

యేడాదికి ఆరు సినిమాలు...

ఎన్‌టిఆర్, ఏయన్నార్.. మూడేళ్లు నాతో నటించకుండా నన్ను బాయ్‌కాట్ చేశారు. అందుకు వాళ్ళు చెప్పిన కారణాలు విన్నాక నాకు నవ్వు వచ్చింది. నేను కాలుమీద కాలు వేసుకుని కూర్చుంటానని, నిర్మాతలకు ఇబ్బంది పెడతానని, టైమ్‌కి సెట్స్‌లోకి రానని ప్రచారం చేశారు. నేను కాలు మీద కాలు వేసుకుని కూర్చోవడంలో తప్పేమిటో అర్థం కాలేదు. అంటే ఒక హీరోయిన్ అలా కూర్చోకూడదనా వాళ్ల ఉద్దేశం? అంత పెద్ద హీరోలకి ఆడవాళ్ల మీద అలాంటి అభిప్రాయం ఉండటం సరికాదు. వాళ్లు అన్నమాటలనే నిజం అయి ఉంటే, ప్రతి కంపెనీలోనూ ఆరు సినిమాలు ఎలా చేయగలుగుతాను. అంతేనా నేను నటించిన సినిమాలు ఏడాదికి ఆరు విడుదలయ్యేవి. నిజంగానే నేను పొగరుగా ఉండి, టైమ్‌కి షూటింగ్‌కి రాకపోతే ఇన్ని సినిమాలు చేయగలిగేదానినా!

పరిశ్రమ ఎంతో మారిపోయింది...

అప్పట్లో నిర్మాతలు విలువలు పాటించేవారు. వ్యాపార దృక్పథంతో పాటు కంపెనీ నిలబడి బెస్ట్‌గా ఉండాలి అనుకునేవారు. అన్నపూర్ణ, జగపతి, సురేశ్ అందరూ ఉద్దండులే! ప్రస్తుతం సినీ రంగంలో 'నిర్మాతలు' అని చెప్పుకునేవారికి, మా తరం నిర్మాతలకీ పొంతన లేదు. ఈ తరం నిర్మాతలు 'ఫలానా హీరోయిన్ అయితే బావుంటుంది' అనుకుంటున్నారు. ఓపెనింగ్‌లకి హీరోయిన్లను పిలిచి చేయి వేస్తున్నారు. అంత బలహీనంగా ఉంది వారి తత్వం. ఆ రోజులతో పోలిస్తే ఇప్పుడు లైంగిక వేధింపు ఎక్కువగా ఉందేమో అనిపిస్తుంది.

నేను శక్తిని...

నేను సినిమాలలో శక్తిస్వరూపిణిగా కత్తిదూసి యుద్ధం చేశాను గనుక 'జమున శక్తి స్వరూపం' అని నాకు పేరు. నేను శక్తిని అనుకోవడం ప్రతి స్త్రీకి చాలా అవసరం. ప్రస్తుతం అమ్మాయిలు బాగా చదువుకుంటున్నారు. వారిని ప్రభుత్వం కూడా ప్రోత్సహించాలి. జీవితం అంటే పెళ్లికాదు, మొగుడి చేతిలో బానిసలా ఉండక్కర్లేదు. చక్కగా చదువుకున్నవారు తగిన ఉద్యోగం చేయొచ్చు. చదువురానివారు రెండు గేదెలను లేదా ఆవులను కొనుక్కుని పాల వ్యాపారం చేసుకుంటూ హుందాగా బతకొచ్చు. అంతేకాని ఆత్మాభిమానం చంపుకుని బతకవలసిన అవసరం లేదని నా అభిప్రాయం.

అమ్మ పెంపకంలో...

మా అమ్మ చాలా ధైర్యవంతురాలు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని రెండు రోజులు జైలుకి కూడా వెళ్లింది. ధైర్యంగా ఉండటం ఆవిడ దగ్గర్నుంచే నేర్చుకున్నాను. ఆత్మ విశ్వాసం, వ్యక్తిత్వం కాపాడుకోవడం కూడా అమ్మదగ్గర నుంచే నేర్చుకున్నాను. అందుకే అందరూ నాకు అన్నీ అమ్మ బుద్ధులే వచ్చాయి అనేవారు. మా అమ్మ, సాక్షాత్తు దేవత. ఆవిడ పెంపకంలోనే ఆత్మగౌరవం నిలబెట్టుకోవడం, ఎటువంటి సమస్యలు ఎదురైనా తట్టుకోవడం వచ్చాయేమో అనిపిస్తుంది.

(వై. జయంతిగారికి కృతజ్ఞతలు)

మాతృభాషను విస్మరించడం అంటే జన్మనిచ్చిన తల్లిని విస్మరించడమే!

భారత ఉపరాష్ట్రపతి శ్రీమాన్ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారికి మాతృభాష అంటే ఎంతో గౌరవం. గౌరవానికి మించిన వాత్సల్యం, మక్కువ. వెంకయ్యనాయుడు తెలుగు మాట్లాడుతుంటే సంగీతం వింటున్నంతటి శ్రావ్యంగా ఉంటుంది. భారతియార్ చెప్పిన సుందర తెలుంగు ఆయన నోటి వెంటే వినాలి. వాక్య విరామాలు లేకుండా అనర్గళంగా మాట్లాడే చాతుర్యం ఆయన దగ్గరనే ఉన్నది. మొదట్నుంచీ ఒకే పార్టీని నమ్ముకున్న శీల వంతుడాయన. గంటల కొలదీ ఆయన మాట్లాడుతుంటే చెవులు రిక్కించి వింటాను. అది నాకు ఆనందం.

తల్లిభాష తేజస్సెరిగినవాడు తల్లిభాషే మన తేజస్సు అనే అచ్చ తెలుగులో మాట్లాడగలవాడు

మాతృభాషా దినోత్సవం సందర్భంగా నా మాతృభాష అయిన తెలుగు భాషలో మాట్లాడేవారందరికీ శుభాకాంక్షలు తెలువుతున్నాను. మాతృభాషను విస్మరించడమంటే మాతృదేవిని విస్మరించడమేనని మహాత్మాగాంధీ అన్న మాటల్ని గుర్తు పెట్టుకుని తెలుగు భాషను నిత్యనూతనంగా సుసంపన్నంగా వర్ధిల్లచేసేందుకు తెలుగువారమంతా కలిసి కట్టుగా కృషి చేయాలని కోరుతున్నాను అన్నారు.

మాతృభాషలన్నిటినీ కాపాడుకోవడం ద్వారానే భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని పరిరక్షించుకోగలమని తీర్మానించి యునెస్కో సాధార సభ ప్రతి యేడాది ఫిబ్రవరి 21వ తేదీన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చింది. మాతృభాషను కాపాడుకుంటూనే దాని ద్వారానే ఇతర భాషల్ని నేర్చుకోవడం అనంత విజ్ఞానాన్ని పొందడం సరైన మార్గం అని యునెస్కో పదే పదే ప్రకటించింది.

'ప్రపంచంలో మాట్లాడే భాషలన్నిటికంటే మనం మన వ్యక్తిగత ప్రపంచంలో ఏ భాషలో మాట్లాడతామో, ఏ భాషలో మన తల్లిదండ్రుల్ని అర్థం చేసుకుంటామో, ఏ భాషలో స్కూల్లో తోటి విద్యార్థులతో మాట్లాడుతామో ఆ భాష, మన భావోద్వేగాల అభివృద్ధికి, జ్ఞానాభివృద్ధికి ఉపయోగపడటంలో గణనీయమైన పాత్ర నిర్వహిస్తుంది. మాతృభాషకు సంబంధించిన సజీవ వారసత్వాన్ని మనం అనుభవించాలి' అని యునెస్కో ప్రకటించింది.

దేశాలు, రాజ్యాలు సరిహద్దులు మారినా మాతృభాష మారదు. మాతృభాషగా ఇంగ్లీషు మాట్లాడే దేశాలెన్నో ఉన్నాయి. పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్‌లలో బెంగాలీలో మాట్లాడతారు. మన తెలుగు రాష్ట్రాలు విడిపోయినా మన మాతృభాష ఒక్కటే. మన సాంస్కృతిక వైవిధ్యాలు సంప్రదాయాలు, కళలు, సంగీతం, నాట్యం, ఆచారాలు, పండుగలు, సంప్రదాయ విజ్ఞానం, వృత్తుల వారసత్వం... వీటిని రక్షించుకోవటం మన మాతృభాషను కాపాడుకోవడంతోనే సాధ్యపడుతుంది. మాతృభాషనే కోల్పోతే మనం వారసత్వంగా సాధించుకున్నదంతా కోల్పోతాం. ఇతర ప్రాంతాల్లో మన గుర్తింపును గౌరవాన్ని కోల్పోతాం. ఈ సత్యాన్ని తెలుగువారందరూ గ్రహించాల్సిన అవసరం ఉన్నది.

'తల్లి నుడి కంటే పరమామృతంబు కలదె' అన్నాడు మహా కవి రాయప్రోలు. స్కూళ్లలో, కళాశాలల్లో, జనవ్యవహారంలో, ప్రసార మాధ్యమాల్లో, చట్టసభల్లో, ప్రభుత్వ వ్యవహారాల్లో, శిలా ఫలకాల్లో అంతటా తెలుగు పరిస్థితి దయనీయంగా ఉన్నదని జ్ఞానపీఠ పురస్కార గ్రహీత సి. నారాయణరెడ్డి వాపోయారు. తెలుగుభాషను రక్షించుకోవడం అంటే స్వాభిమానాన్ని కాపాడుకోవడం అని ప్రతి ఒక్క తెలుగువాడూ భావించాలి. ఎవరికి వారే తమ మాతృభాష తెలుగు అని గుర్తుపెట్టుకోవాలి.

ప్రపంచంలో అత్యధికులు మాట్లాడే భాషల్లో ఒకటైన తెలుగుకు అన్ని శాస్త్ర సాంకేతిక అవసరాలకు అనుగుణంగా ఎదగగల శక్తి సామర్థ్యాలున్నాయి. ఎంతో సాహిత్య, సాంస్కృతిక చరిత్ర ఉంది. మన ప్రభుత్వాలు ప్రజల భాషలో పరిపాలనను, విద్యను, శాస్త్ర సాంకేతిక జ్ఞానాభివృద్ధిని, సమాచార సాధనాలను శక్తిమంతం చేసేందుకు పూనుకోవాలి. విద్యార్థుల్లో మాతృభాష పట్ల చులకన భావం లేకుండా తల్లిదండ్రులే పూనుకోవాలి. ఉద్యోగాల కోసం తల్లిదండ్రులు ఇంగ్లీషుపై ఆసక్తి చూపుతున్నా మన మాతృభాషను ప్రోత్సహించడం ద్వారా కూడా ఆ లక్ష్యాలను సాధించవచ్చనే రీతిలో ప్రభుత్వం వ్యవహరించాలి. ఒకటో తరగతి నుంచి ఉన్నత స్థాయి వరకూ, అలాగే ప్రొఫెషనల్ కోర్సులైన వైద్య, ఇంజనీరింగ్, శాస్త్ర సాంకేతిక సామాజిక, న్యాయ, పరిపాలన తదితర అన్ని రంగాల్లోనూ తెలుగు భాషను విస్తృతంగా ఉపయోగించుకునేందుకు కృషి చేయాల్సి ఉంది. ఒక పటిష్టమైన భాషా విధానం ఉంటే ఏ భాషనైనా మనం కాపాడుకోవచ్చునని యునెస్కో చేసిన తీర్మానానికి అనుగుణంగా మన రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన భాషా విధానాన్ని ప్రకటించడమే కాక, దాన్ని ఆచరించేందుకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలి. చిత్తశుద్ధి ఉంటేనే కార్యసిద్ధి జరుగుతుంది.

తెలుగు పరిరక్షణకు కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉన్నది. మారుమూల గ్రామాల్లో అక్కడ ఉన్న తెలుగు పదజాలాన్ని సమీకరించడం, అంతరిస్తున్న తెలుగు పదాలను వెలికి తీసి కాపాడుకోవడం, శాస్త్ర సాంకేతిక పారిభాషిక పదాలను తయారు చేయడం, వృత్తి పదకోశాలు, మాండలిక పదకోశాలు రూపొందించడం, అంతర్జాతీయ తెలుగు సభలను పలుచోట్ల నిర్వహించడం అవసరం. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మన భాషను కూడా వేగంగా వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది. నేడు మనంఉపయోగిస్తున్న సెల్‌ఫోన్లు, ఐపాడ్ తదితర ఆధునిక ఉపకరణాలను కూడా భాషాభివృద్ధికి వాడుకోవాలి. ఇవన్నీ జరుగుతున్నప్పటికీ మరింత విస్తృతంగా చైతన్యవంతంగా జరగాలి.

తెలుగుభాష పరిరక్షణ కోసం చర్యలు తీసుకోకపోతే కొన్ని సంచార జాతుల్లో మిగిలి ఉన్న భాషల తరహాలోనే తెలుగు కూడా మౌఖిక భాషగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది. మౌఖికంగా నేటి తరంలో అత్యధికులు తెలుగు రాయలేని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వాలే కాదు, సంస్థలు, ప్రజలు కలిసికట్టుగా కృషి చేసి మన మాతృభాషను కాపాడుకోవాలి. పూర్వ ప్రాభవాన్ని నెలకొల్పాలి.

తెలుగును కాపాడుకోవాలి అంటూ మనమందరూ ప్రతిన బూనుదాం. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర ప్రత్యుత్తరాలు, నివేదికలు, విజ్ఞాపనలు తెలుగులోనే స్వీకరించేటట్లుగా ఒత్తిడి తేవాలి. ఇతర భాషలు నేర్చుకోవచ్చు. కానీ అమ్మ భాషను మరువరాదు.

ఇంగ్లీషు మీడియం చదివితేనే ఉన్నత స్థాయికి ఎదగగలమని భావించడం పొరపాటు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, నేనూ సాధారణ బడుల్లో చదివినా ఈ స్థాయికి వచ్చామని తెలుసుకోవాలి. తెలుగు రాష్ట్రాలలో ఉద్యోగం రావాలంటే తెలుగు కనీసం వచ్చి ఉండాలి. లేదా ఆరు నెలల్లో నేర్చుకోవాలని నిబంధన విధించాలి. ప్రజల భాష తెలియని వారు పరిపాలన ఎలా చేయగలరు? ప్రజలకు సేవలు ఎలా అందించగలరు?

ఈ మధ్య రష్యా, చైనా, జర్మనీ, ఫ్రాన్స్, ఇరాన్ అధినేతలు ఇండియా వచ్చారు. వారిలో కొందరికి ఇంగ్లీషు భాష వచ్చినా తమ మాతృభాషల్లోనే మాట్లాడారు. సహాయకులు తర్జుమా చేశారు. భాషాభిమానం, దేశాభిమానం ప్రతి ఒక్కరికీ అవసరం అని గుర్తు చేస్తున్నాను. ●



శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

115

పదునెనిమిదవ అధ్యాయము - మోక్ష సన్న్యాస విభాగయోగము

74. ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః
సంవాదమిమమశ్రౌష మద్భుతం రోమహర్షణమ్

వ్యాఖ్య : శ్రీకృష్ణపరమాత్మ కావించిన గీతాబోధయంతయు వ్యాసుల యనుగ్రహముచే వినగల్గిన సంజయుడు, తచ్ఛ్రవణానంతరము అపూర్వమగు తన ఆనందాతిశయమును ధృతరాష్ట్రున కెఱిగించుచున్నాడు–

'పార్థస్య చ మహాత్మనః'– ఇంతదనుక మోహగ్రస్తుడై, భ్రాంతియుక్తుడై, అల్పాత్ముడుగ నున్నట్టి అర్జునుడు భగవానుని దివ్యబోధలచే 'మహాత్ముడు'గ మారిపోయెను. అర్జునునివలెనే ప్రతివారునుగూడ శ్రీకృష్ణుని బోధామృతమును చక్కగా పానము చేసి సంసార బంధవిచ్ఛిత్తిని, మాయామోహవినాశమును గావించుకొని 'మహాత్ములై' పఱగవలెను. 'మహాత్మా' అనునది ఒక బిరుదు ప్రయత్నముచే దాని నెవరైనను సంపాదించుకొనవచ్చును. గీత యొక్క ముఖ్యోద్దేశ్యము, అక్ష్యము అల్పాత్ములను మహాత్ములుగ జేయుటయే యగును. మందబుద్ధులను బుద్ధి మంతులుగ మార్చుటయే యగును. అజ్ఞానిని జ్ఞానిగ నొనర్చుటయే యగును.

'అద్భుతం రోమహర్షణమ్'– శ్రీకృష్ణార్జున సంవాదరూపమగు ఈ గీతాశాస్త్రము అత్యాశ్చర్యకరమైనది. ఏలయనిన స్పర్శవేది ఇనుమును బంగారుగ జేయునట్లు ఈ శాస్త్రము మాయామోహితుని మాయవిముక్తునిగ జేయగల్గుచున్నది. ఏడ్చుచున్న వానిని నవ్వించుచున్నది. ఇట్టి అమోఘదైవీశక్తి దీనియందు కలుగు. మఱియు దీనిని చదివిన, వినిన వ్యక్తి ఆనందముతో తన్మయుడైపోవును. ఇక్కారణముననే దీనిని సంజయుడు 'అద్భుతమనియు', 'రోమహర్షణ' మనియు వర్ణించిచెప్పెను. ఇట్టి అపూర్వ మహిమ ఈ గీతాశాస్త్రమునందుండుటవలననే ఇయ్యది జగద్విఖ్యాతమై సర్వజనసమాదరణీయమై, ముముక్షువులకు కల్పతరువై యొప్పుచున్నది.

75. వ్యాసప్రసాదాచ్ఛ్రుతవా నేత ద్గుహ్యతమం పరమ్
యోగం యోగేశ్వరాత్కృష్ణా త్సాక్షాత్కథయతస్స్వయమ్

వ్యాఖ్య : ఈ గీతాశాస్త్రమును గూర్చి 'యోగమ్' అని యిచట చెప్పబడినది. యోగమనగా కలుపునది. జీవుని పరమాత్మతతో నైక్యపఱచునది యని అర్థము. ఈ గీతోపదేశము అట్టిదే కావున నిది యోగమనబడినది. మఱియు నిది పరమరహస్యమైనదనియు, సర్వోత్కృష్టమైనదనియు, నిట చెప్పబడినది. కావున ముముక్షువులకు అవశ్యము ఉపాధేయచమై యొప్పుచున్నది.

'యోగేశ్వరాత్'– యోగమునకు ప్రభువు యోగేశ్వరుడు. యోగమును గుఱించి సంపూర్ణముగ నెఱిగినవాడు శ్రీకృష్ణ పరమాత్మ కాబట్టి అట్టి మహనీయుడు ఉపదేశించిన ఈ గీతారూపయోగశాస్త్రమునందు జనుల కెంతటి విశ్వాసముండ వలెనో యోచించుకొనవచ్చును.

'సాక్షాత్'– శ్రీవ్యాసుల యనుగ్రహముచేత గీతాశాస్త్రమును ప్రత్యక్షముగ తాను వినగల్గితినని సంజయుడు చెప్పుచున్నాడు. శ్రీవ్యాసమహర్షి సంజయునకు దూర శ్రవణ, దూరదర్శనశక్తి నొసంగినందువలన రణరంగమున జరిగిన ఈ సంవాదమును ఇంటి యొద్దనుండియే యాతడు వినగల్గెను. చూడగల్గెను. కావున సంజయుడు ధృతరాష్ట్రునకు వచించినది ప్రత్యక్ష ప్రమాణమే అయియున్నది. అనగా సాక్షాత్ భగవానుని ముఖతః గీతాబోధ ఏ ప్రకారము వెలువడెనో దానిని ఉన్నది ఉన్నట్లుగ నాతడు చెప్పగల్గెనని భావము. ఈ ప్రకారముగ సంజయుడు చెప్పినది సాక్షాత్ భగవత్ప్రోక్తములైన వాక్యములే కాబట్టి గీతాగ్రంథముపై సర్వులకును పరమ విశ్వాసముండవలయును.

'స్వయమ్'– అని చెప్పుట వలన భగవానుడు స్వయముగ బోధించిన యుపదేశమగుటచే దీనికి అపరిమైతమైన విలువకలదు.

76. రాజన్సంస్మృత సంస్మృత్య సంవాదమిమమద్భుతమ్
కేశవార్జునయోః పుణ్యయం హృష్యామి చ ముహుర్ముహుః

వ్యాఖ్య: సంజయుడు గీతాసంస్మరణజనిత మహదానందమును వ్యక్తమొనర్చుచున్నాడు.

'సంస్మృత్య సంస్మృత్య'– 'సంస్మృత్య' అని చెప్పుటలోను, సంస్మృత్య అని ఒక పర్యాయము చెప్పక, రెండు పర్యాయములు చెప్పుటలోను విశేషము కలదు. వివినబోధను లెస్సగ స్మరించుటయే సంస్మరణము. మఱియు ఆ పదమును రెండుసార్లు చెప్పుటచే అర్థానిని మఱల మఱల లెస్సగా స్మరించవలెనని భావము. సంజయుడు ఆ ప్రకారమే చేసెను. అనగా భగవత్ప్రోక్తమగు ఈ గీతాజ్ఞానమును వినుట మాత్రములో తృప్తిపడక, దానిని మఱల, మఱల స్మరింపదొడగను. అనగా తీవ్రముగా మననముచేసెను. అట్టి మననము చేయుటవలననే దాని యర్థము చక్కగ హృదయమున ప్రవేశించును (1) శ్రవణము (2) మననము (3) నిధి ధ్యాసనము– అని మూడు పద్ధతులు శాస్త్రమునందు చెప్పబడినవి. సంజయుడు మొదట గీతాబోధను శ్రవణము చేసెను. ఆ పిదప మనననిధిధ్యాసనములను గావించి తత్ఫలితముగ పరమానందమును బొందగల్గెను.

'పుణ్యమ్' అని చెప్పుటవలన కృష్ణార్జున సంవాదరూపమగు ఈ గీతాశాస్త్రము మహాపుణ్యప్రదమైనదియు, అతిపావనమైనదియు నని భావము. సాక్షాత్ మోక్షమునే కలుగజేయు పవిత్ర వస్తువు కనుకనే దీనిని 'పుణ్యమ్' అని చెప్పిరి. అనగా ఈ గీతాశాస్త్రము మూర్తీభవించిన పుణ్యమే యనియు, పాపక్షయకరమనియు భావము.

'హృష్యామి చ ముహుర్ముహుః'– స్వస్వరూప సాక్షాత్కారసమయమున, లేక భగవదైక్యము నొందుసమయమున జీవుడు దుఃఖరాహిత్యమును, అతిహర్షమును బొందును. ఆనందమును మాటిమాటికి అనుభవించును. దుఃఖమయమగు ఈ సంసారమున మనుజునకు కావలసినది ఆనందమే (హర్షమే) కదా! దుఃఖరాహిత్యమే కదా! అట్టిది ఈ గీతాశాస్త్రము ద్వారా జీవునకు లభించుచున్నది. దుఃఖమగ్నుడగు జీవునకు అనంతానందము దీని ద్వారా సంప్రాప్తించుచున్నది. అర్జునుడే యిందులకు దృష్టాంతము. మొదట (విషీదన్తం' అనునట్లు) పరమశోకాకులుడైయున్న అర్జునుడు గీతాశాస్త్ర శ్రవణముచే,మననముచే 'నష్టోమోహః' అనునట్లు) మోహనరహితుడై ఆనందపరవశుడై కర్తవ్య నిర్వహణము నిమిత్తము రణరంగమున దుమికెను. అట్లే సంజయుడు గీతాశ్రవణమననములచే మాటిమాటికి పరమానందము నొందుచుండెను. (హృష్యామి చ ముహుర్ముహుః) ఈ ప్రకారముగ గీతాశ్రవణముచే ఇరువురును వెంట వెంటనే పరమానందము నొందగల్గిరి. కాబట్టి ఆనందము నపేక్షించు ప్రతిమానవుడును, దుఃఖము నంతమొందించగోరు ప్రతివ్యక్తియు ఈ గీతాశాస్త్రమును తప్పకచదివి, అర్థాని మనన నిధి ధ్యాసనములను గావింప వలెను. దుఃఖాకులురగు ప్రాణుల కీశాస్త్రము సంజీవివంటిదై యున్నది. వెయ్యేల, సమస్త జీవులకు ఆనందము నొసంగునదైయున్నది. సంజయుని పై వాక్కులే ఇందులకు తార్కాణము.

(తరువాయి వచ్చే సంచికలో)

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation

నేను నా బాధ్యతను విస్మరిస్తే సమస్త భూమండలమూ కూలిపోతూంది!

సజ్జన సాంగత్యం

ఆదిశేషుడు సమస్త భూమండలాన్ని తన వేయి పడగలపై మోస్తున్నాడు. ఒక రోజు బ్రహ్మదేవునికి ధీటుగా సృష్టికి ప్రతి సృష్టి గావించిన రాజర్షి విశ్వామిత్రుడు వచ్చి ఆదిశేషుడిని తనతో రమ్మన్నాడు. ఆదిశేషుడు మిక్కిలి వినయ విధేయతలతో “ఓ మహర్షీ! ఈ సమస్త భూమండలం నా శిరస్సుపైనే ఉంది. దీనిని పరిరక్షించ డమే నా కర్తవ్యం. నేను ఈ కార్యాన్ని విస్మరిస్తే, ఈ భూమండలం పాతాళంవైపు పడిపోవడం తథ్యం. అప్పుడు కోటానుకోట్ల జీవరాశులు నా మూలంగా నాశ నమైపోయే ప్రమాదం ఉంది” అన్నాడు.

ఆ మాటలకు విశ్వామిత్ర మహర్షి చిరునవ్వు నవ్వి, “అటువంటిదే గనుక జరిగితే నేను నా అమోఘమైన తపశ్శక్తితో దానిని ఆపుతాను” అన్నాడు.

ఆదిశేషుడు అందుకు ఒప్పుకోలేదు. విశ్వామిత్రుడు ఎన్ని విధాలుగా నచ్చ జెప్పి చూసినా ఆదిశేషుడు తన నిర్దేశిత కార్యాన్ని వదలనని మొండిపట్టు పట్టాడు. ఆదిశేషుని మంకుపట్టు చూసి విశ్వామిత్రునికి తీవ్రమైన కోపం వచ్చింది. కమండలం ఎత్తి శపించబోయాడు. ఆదిశేషుడు భయపడి చేసేది లేక భూమిని పక్కన పెట్టి వచ్చాడు.

అంతలోనే ఘోరమైన విపత్తు సంభవించింది. ఆదిశేషుని వేయిపడగలపై భద్రంగా వున్న భూగోళం వెంటనే పాతాళం వైపు పడిపోవడం ప్రారంభించింది. దానిపై నివాసముంటున్న వేల కోట్ల జీవరాశులు ప్రాణభయంతో ఆర్తనాదాలు చేయడం ప్రారంభించాయి. జరిగిన దానిని చూసి తీవ్రమైన దుఃఖంతో ఆదిశేషుడు మాన్పడిపోగా, తపశ్శక్తి సంపన్నుడనన్న గర్వంతో విశ్వామిత్రుడు తన కమండలం లోని నీరు ధారపోసి ‘ఆగు’ అంటూ భూమిని ఆజ్ఞాపించాడు. భూగోళ పతనం ఆగకపోగా, మరింత వేగంగా పడిపోవడం ప్రారంభించింది. విశ్వామిత్ర మహర్షి పట్టరాని ఆగ్రహంతో ‘నా తపశ్శక్తి అంతా ధారపోస్తున్నాను, వెంటనే ఆగు’ అంటూ ఆజ్ఞాపించాడు. అయినా ఫలితం లేకపోయింది.

దఆంతో విశ్వామిత్రునికి అహంకార మైకం తొలగిపోయింది. భూమిని ఆపడానికి తన తపశ్శక్తి చాలదని తెలుసుకున్నాడు. ఏం చేయాలా అని ఆలోచిస్తుండగా నారద మహర్షి అక్కడికి వచ్చి జరిగిన దానిని తెలుసుకుని ‘నీవు ఎప్పుడైనా సజ్జన సాంగత్యం చేసి వుంటే ఆ ఫలితాన్ని వెంటనే ధారపోయి. భూపతనం ఆగిపోతుంది” అని చెప్పాడు.

విశ్వామిత్రుడు ఆలోచనలో పడ్డాడు. తాను అందరితో తగవులు పెట్టుకోవడమే కాని సజ్జన సాంగత్యం చేసింది లేదు. సాటి ముని పుంగవులతోనూ తగవులే. సత్సంగం చేసింది లేదు. అయినా తాను వశిష్ట మహర్షి వద్దకు వెళ్ళిన సంగతి జ్ఞప్తికి తెచ్చుకొని ఆ పుణ్యాన్ని ధార పోయగా వెంటనే భూగోళ పతనం ఆగిపోయింది. ఆది శేషుడు యధావిధిగా తిరిగి భూమండలాన్ని తలకు ఎత్తుకున్నాడు.



మానవులలో దానవ మానవ గుణాలు రెండూ నిక్షిప్తమై వుంటాయి. సమయం సందర్భం బట్టి ఏదో ఒక గుణం బయటకు ప్రకటితమౌతూ వుం టుంది. దుర్జనులతో సాంగత్యం చేస్తే అసుర గుణం బలీకృతమై ఎన్నో చెడ్డ పనులను చేస్తాం. సజ్జన సాంగత్యం కలిగే ఉంటే, మనలో రజో, తమో గుణాలను తగ్గించి సాత్విక గుణాలను పెంచుతుంది. ●

Lovely Stay at Holy Tirupathi   *The Gateway of Lord Balaji*

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

ఆడపిల్ల పుట్టరాదా!

దేశంలోని కొన్ని ప్రాంతాలలో ఆడపిల్ల పుట్టడమే అపరాధంగా భావిస్తూ తల్లినీ, బిడ్డనూ ఇంట్లోకి రానివ్వని వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి.

మరికొన్ని ప్రాంతాలలో ఈడు వచ్చిన అబ్బాయిలకు పెళ్ళికూతుళ్ళు (అమ్మాయిలు) దొరకక బ్రహ్మచారులుగా ఉంటున్నారనే వార్తలూ వస్తున్నాయ్.

ఎక్కడో కాదు ఆంధ్రదేశంలోనే యిలాటి వార్తలు రావడం విచారకరంగా ఉన్నాయ్.

తానెలా పుట్టాడు? తన తల్లి ఎలా పుట్టింది? తన తల్లి ఆడదేకదా! తన తండ్రి ఓ యింట పుట్టిన ఆడపిల్లను పెళ్ళాడి సంసారం చేస్తేనే కదా తాను పుట్టాననే జ్ఞానం ఎందుకు కలుగడం లేదు? ఈ అజ్ఞానం ఎందుకు ప్రబలుతోంది? సమాజ పెద్దలు హితబోధలు చేయాలి! ఆడపిల్లను కన్న తల్లినీ, బిడ్డనూ వీధిన పడేసిన వారిని కఠినంగా శిక్షిస్తామని పురపెద్దలు, ప్రభుత్వం హెచ్చరించాలి.

ఆడపిల్ల పుట్టిందని... భార్యను ఇంట్లోకి రానివ్వని అత్త, భర్త

మంగళగిరి (గుంటూరు) : ఆడపిల్ల పుట్టిందని భర్త, అత్త తనను ఇంట్లోకి రానివ్వడం లేదంటూ ఓ వివాహిత చంటిబిడ్డతోపాటు ఆందోళనకు దిగింది. ఈ ఘటన పట్టణంలోని రత్నాలచెరువులో జరిగింది. గుంటూరు జిల్లా మంగళగిరిలో 21వ వార్డు రత్నాల చెరువులో నివసిస్తూ కంసాలి పనిచేసే గంజి శ్రీనివాసరావు అనే యువకుడికి అదే ప్రాంతానికి చెందిన మౌనికతో రెండేళ్ల క్రింత వివాహం జరిగింది. ఆమె కాన్పు కోసం పుట్టింటికి వెళ్ళి ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఈ కారణంతో అత్త, భర్త మూడు నెలలుగా మౌనికను చూసేందుకు ఇష్టపడకపోగా ఆమెను పుట్టింటి నుండి తమ ఇంటికి తీసుకువెళ్ళేందుకు నిరాకరించారు. దీంతో మౌనిక పుట్టింట్లోనే ఉంటోంది. ఆమె తల్లిదండ్రులు, బంధువులు ఎంత నచ్చచెప్పినా ఆమెను ఇంటికి తీసుకువచ్చేందుకు వారు ఒప్పుకోకపోవడంతో అత్త ఇంటికి వెళ్లాలని నిర్ణయించుకుంది. ఈ సమాచారం తెలుసుకున్న భర్త శ్రీనివాసరావు, అత్త రాజ్యం రెండు రోజుల క్రితమే ఇంటికి తాళం వేసి వెళ్లారు. దీంతో మౌనిక భర్త ఇంటి వద్దకు బిడ్డతో వెళ్లి ఆందోళనకు దిగింది.



ధీరమూర్తి - నిరాడంబర మూర్తి

బులుసు సాంబశివమూర్తి

కాకినాడలో, పి.ఆర్. ప్రభుత్వ కళాశాల ఎదుట దేశోన్నతిని, దేశపతనాన్ని వీక్షించే నిలువెత్తు విగ్రహ ముంది. ఆ విగ్రహం ఎవరిదని వందమంది విద్యార్థులనడిగా, తెలియదన్నారు. నవ్వాలో, ఏడవాలో నాకు తెలియలేదు. నవ్వుకాని నవ్వు నవ్వవలసి వచ్చింది. శ్రీహరీ! ఒక క్రికెట్ ఆటగాడు ఎన్ని పరుగులు తీశాడో, ఎన్ని వికెట్లు పడగొట్టాడో అడిగితే తడుముకోకుండా సమాధానం చెప్పగలరు. సినీ తారల పెదవులనే చిత్రించి, అవి ఎవరి పెదవులో పేర్కొనండని బహుమతిని ఇస్తామని ఒకరు ప్రకటించగా వేలకొద్దీ ఆ పోటీలో పాల్గొన్నారు. ఇది కాల మహిమ.

ఆ విగ్రహం ఎవరిదో కాదు. జీవితం అంతా నిరంతరమైన పోరాటంతో కొనసాగించిన త్యాగమూర్తి, శ్రీ బులుసు సాంబమూర్తిగారిది. బులుసులేని యజ్ఞం, బులుసులేని తద్దినం లేదని ఒకనాటి సామెత. అట్టి బులుసువారి వంశంలో సాంబమూర్తి తూర్పుగోదావరి జిల్లాలోని దుళ్ళ గ్రామంలో 1886లో జన్మించారు. మద్రాసు విశ్వవిద్యాలయం నుండి పట్టా పొంది, విజయనగరం మహారాజా వారి కళాశాలలో అధ్యాపకవృత్తితో కొంతకాలం గడిపారు. 1911లో న్యాయవాద పట్టాను పొంది కాకినాడలో న్యాయవాద వృత్తిలో ఉంటూ రెండు చేతులా సంపాదించి విలాసవంతమైన జీవితం గడిపారు.

స్వాతంత్ర్య ఉద్యమం ఊపిరిపోసుకొన్న రోజులవి. అనిబిసెంటు స్థాపించిన హోమ్‌రూల్ ఉద్యమంలో పాల్గొన్నారు. మహాత్ముని సహాయ నిరాకరణ ఉద్యమం వల్ల ఆకర్షితులై సర్వాన్ని త్యజించి కొల్లాయి గుడ్డకట్టి నిరాడంబర జీవితానికి శ్రీకారం చుట్టారు.

ఆనాడు ఉత్సవాల్లో జాతీయ పతాకాన్ని ధరించడం నేరంగా పరిగణింపబడింది. ఆ నియమాన్ని రద్దు చేయాలని 1923లో సత్యాగ్రహం చేశారు. ఆ సంవత్సరమే కాకినాడలో అఖిల భారతీయ కాంగ్రెస్ సమావేశాలు జరిగాయి. కార్యనిర్వహణ బాధ్యత వీరినెత్తిపై పడింది. ఒక్క కొడుకు కాలం చేయగా పుట్టెడు దుఃఖాన్ని మ్రింగుకొని కార్యదర్శిగా ఉంటూ సభలను దిగ్విజయంగా నడిపించారు. భరద్వాజ విందు జరిగిందని ఆనాటి పత్రికలు ప్రశంసించాయి. కాంగ్రెస్ కార్యకర్తగా దుర్గాబాయ్ అప్పుడే రంగప్రవేశం చేసింది. అందులకు కారణం సాంబమూర్తిగారే.

జనరల్ నీల్ దొర విగ్రహం మద్రాసు ఉన్నత న్యాయస్థానం ఎదుట ఉండేది. 1857లో అనేకులు, అసువులు బాయడానికి అతడు కారకుడు. అతని విగ్రహాన్ని తొలగించాలని సాంబమూర్తిగారు సత్యాగ్రహం చేశారు. 1937లో రాజాజీ మద్రాసు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దానిని తొలగించి ఒక మ్యూజియంలో భద్రపరిచారు.

సైమన్ కమిషన్‌ని ఎదుర్కొన్నవారిలో ప్రకాశం పంతులు గారు ప్రముఖులని జగత్ప్రసిద్ధమే కదా! ఆ ఉద్యమంలో వీరు తమవంతు పాత్రను నిర్వహించారు. ఉప్పు సత్యాగ్రహంలోనూ పాల్గొన్నారు. ఉప్పుపై పన్నును నిషేధించేంతవరకూ ఉప్పుని ముట్టనని ప్రతిజ్ఞ చేశారు.

తెల్లదొరల పాలనలో ఈయన పడిన కష్టాలు అంతా ఇంతాకావు. జె.బి. బ్రౌన్ అనే కలక్టరు సత్యాగ్రహంపై క్రూరంగా విరుచుని పడేవాడు. అతని క్రింది అధికారులైన ముస్తాఫ్ అలీఖాన్, దప్పుల సుబ్బారావు మొ॥ పోలీసు ఆఫీసర్లు యమకింకరుల్లా సత్యాగ్రహులను లాఠీలతో చావబాదేవారు. అన్నిటిని సహించి ముందుకు సాగిపోయేవారు సాంబమూర్తి గారు. అయితే ఈయన స్పీకర్ (సభాపతి)గా ఎన్నుకొనబడినపుడు ఆ పోలీసు అధికారులపై కక్ష చూపించలేదు. అట్టి క్షమామూర్తికి సాష్టాంగ నమస్కారాలు.

ప్రతి సంవత్సరమూ జరిగే కాంగ్రెసు జాతీయ సభలలో సంపూర్ణ స్వాతంత్ర్యమే కావాలని ఈయన పట్టుబడుతూ ఉండేవాడు. ఆంధ్ర కాంగ్రెస్ సంస్థకు అధ్యక్షునిగా, కార్యదర్శిగా పనిచేసేవారు. 1937లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెసు విజయానికి ఈయన దోహదం చేసారు. అప్పుడే సభాపతిగా ఎన్నుకొన బడ్డారు. చెన్నపురి ఆంధ్రమహాసభను స్థాపించి అక్కడున్న తెలుగువారిలో సాంస్కృతిక చైతన్యాన్ని తీసికొని వచ్చారు.

దుర్గాబాయ్ మాదిరిగా, దువ్వూరి సుబ్బమ్మను రాజకీయ రంగంలో తీసికొనివచ్చిన ఘనత వీరిదే.

కొన్ని పొరపాట్లు లేకుండా సుదీర్ఘ జీవితం సాగదు. రెండవ ప్రపంచ యుద్ధంలో కాంగ్రెస్ లక్ష్యానికి విరుద్ధంగా అట్లే క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించిన వ్యక్తి రాజాజీ. ఆయన సభలకు ఈయన అధ్యక్షుడుగా ఉండడం తటస్థించింది. ఈ పనిని పెద్ద కాంగ్రెస్ నాయకులే ఈసడించారు.

అలా ఆంధ్ర విశ్వవిద్యాలయ కులపతి పోటీలో ప్రముఖ విద్యావేత్త, మహావక్తయైన కట్టమంచి రామలింగారెడ్డిగారితో పోటీపడటం, ఓడిపోవడమూ కూడా జరిగింది. 1946 ఎన్నికలలో ఓటమిని చవిచూడవలసి వచ్చింది. 1952లో ప్రజాపార్టీ అభ్యర్థిగా గెలిచారు.

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాభివృద్ధికై పొట్టి శ్రీరాములు గారు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టినప్పుడు ఎవ్వరూ ఆయనకు ఆశ్రయమీయలేదు. సాంబమూర్తిగారు తన ఇంటినిచ్చారు.

క్రమక్రమంగా ఈ త్యాగధనుణ్ణి జనులు మరచి పోయారు. భార్యావియోగం, దృష్టి మాంద్యం, దారిద్ర్యం వీరిని పెనవేసికొన్నాయి. ఆనాటి హోం మంత్రి గోవింద్‌వల్లభ్‌పంత్ కొంత ఆర్థిక సహాయం చేసేవారట. 1958 ఫిబ్రవరి 3న వీరి అస్తమయం. ఆనాటి కాకినాడ వాసులు వీరిని ఆదుకొనక పోవడం కేవలం ఆంధ్ర ప్రజల దౌర్భాగ్యం.

ప్రపంచ యుద్ధంలో మద్రాసు నగరంపై బాంబులు పడి ఇళ్ళు ఖాళీ చేస్తూ ఉంటే, నా నోట్లో గాయత్రీ మహామంత్రముండగా నాకు భయమేమిటని ఇల్లు వదలిపెట్టలేదుట. ఇట్టి విశ్వాసం ఉన్నవారెందరు?

ఈ త్యాగమూర్తి యొక్క కూతురు హైదరాబాదు వెళ్ళి తాను ఫలానా అని నెలకింత జీవన భృతిని ప్రసాదించడని అధికారులను అడుగగా సాంబమూర్తి ఎవరని అడిగారట. హరిహరీ! చరిత్ర అధ్యయన హీనత ఎంత పనిచేస్తుందో గమనించారా? జైలు ముఖం చూడని అనేకులకు భరణాలా? రాష్ట్రం సంపాదించిపెట్టిన సాంబమూర్తిగారికి ఒక చిన్న ఇంటి వసతినైనా యివ్వలేకపోయాం. ఇంతకన్నా విశ్వాసఘాతముంటుందా? ఆయనే అమరజీవి పొట్టి శ్రీరాములుగారికి ఆశ్రయం కల్పించాడు. ఆయనే ఆశ్రయం కల్పించకపోతే శ్రీరాములుగారి సంకల్పం నెరవేరేది కాదు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడేది కాదు.

సకల నర్సింహులు శ్రేష్ఠి సకల సుగుణ సంపన్నుడు!

శ్రీరామనవమి రోజున జన్మించారు!

వాల్మీకి నారదమహర్షి ఉపదేశంతో మహాజ్ఞాని అయ్యాడు. జ్ఞాని అయిన వెంటనే ఆయన్ను వేసిన తొలి ప్రశ్నలోనే ఎన్నో విషయాలను ప్రశ్నించాడు. ఆ ఒక్క ప్రశ్నలోనే ఎన్నో ఉప ప్రశ్నల పట్టిక ఉన్నది: ఎవడు ధర్మజ్ఞుడు - ఎవడు కృతజ్ఞుడు? ఎవడు సచ్చరిత్రుడు? ఎవడు సాధుమూర్తి; ఎవడు ఆత్మవంతుడు? ఎవడు అసూయలేనివాడు? ఎవడు నీతి విశారదుడు? ఎవడు బుద్ధిమంతుడు? సౌమ్యుడెవరు? జ్ఞానవంతుడెవరు? క్రోధజితుండెవడరు? స్మృతిమంతుడెవరు? గురువులను, బ్రాహ్మణులను గౌరవించువాడెవరు? సత్పురుషులకెల్ల సర్వదాభిగతుండెవరు? శాంతుడెవరు? సౌశీల్యుడెవరు? ధర్మమెరిగినవాడెవరు?- అంటూ యక్షప్రశ్నలు వేసినపుడు 'శ్రీరాముడు' అన్నాడు. శ్రీరామనవమినాడు శుభగ్రహములన్నీ కూడియున్న నరసింహులు శ్రేష్ఠి సకల సుగుణ సంపన్నునిగా వర్ధిల్లడానికి అదే కారణమైందనవచ్చు.

గీతాబోధకుడు చిన్మయానందుని ప్రియాతి ప్రియమైన వ్యక్తి. చిన్మయానందుని కెంతటి ప్రేమాస్పదుడంటే - దుబాయ్‌లోనివారు గురుసమర్పణగా ఒక కోటును బహూకరిస్తే, ఆయన ధరించకుండా, భద్రంగా తీసుకుని వచ్చి సకల నర్సింహులు శ్రేష్ఠి (చెట్టి గౌరవ వాచకం)కి వాత్సల్యంతో బహూకరించారు.

సర్వసాధారణంగా గురువులకు శిష్యులివ్వడమే తప్ప, గురువులు శిష్యులకు యివ్వడమనేది అరుదుగా ఉంటుంది. గురుసమానులైన బ్రాహ్మణుల నుంచీ కూడా ఆయన ఏవీ గ్రహించరు. బ్రాహ్మణోత్తములకు శిష్య సమర్పణగా యివ్వాలిగానీ, నేను గ్రహించనని ఘట్టిగా వాదించారు. నేను 'ప్రముఖాంధ్ర'కు ప్రకటనల రీత్యానో, బహుమతుల రీత్యానో- నేను గ్రహించడమే గానీ, వారు నానుంచీ గ్రహించలేదు. అపారమైన గురుభక్తీ, బ్రాహ్మణ భక్తి గల యీ వైశ్యకులోత్తముడు శ్రీరామనవమినాడు జన్మించాడని జ్ఞాపకం రాగానే- మనసారా అభినందిస్తున్నాను, ఆశీర్వదిస్తున్నాను. నిజానికి నాకు ఆశీర్వదించే హక్కు లేదు, వయసులో యశస్సులో శ్రీశ్రేష్ఠి నాకన్నా పెద్దవారు.

వయసులో, అంతస్తులో, ఐశ్వర్యంలో గరిష్ఠుడు, నిగర్వి, నిరాడంబరి, నిరహంకారి అని నారదుడు చెప్పినట్లు శ్రీ శ్రేష్ఠి సాధుస్వభావి. సజ్జనుడు. సహృదయుడు.

శ్రీరామచంద్రుని వలె ఆయన కీర్తి శోభిల్లాలి. దీర్ఘాయురారోగ్య ఐశ్వర్య సంపన్నుడు కావాలి!

అస్తు తథాస్తు. శుభమస్తు. సమస్త సన్మంగళానిభవన్తు.

ఆయన కుమారులు శరత్తు, మురళి లిరువురూ, వారి బంగారు వ్యాపారం ప్రతిభా జ్యువెలర్స్; పది కాలాలపాటు వర్ధిల్లాలి, వారి తోడ్పాటు పదిమందికి దోహదం కావాలి!